Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 53 మేడ్చల్ మల్కాజ్‌గిరి 16 మార్చి 2024 శనివారం పేజీలు : 4

## లోక్ సభ ఎన్నికల తర్వాతే జనగణన

కరోనా కారణంగా 2021లో జరగాల్సిన జనగణన నిలిచిపోయింది. జనాభాలో ఇప్పటికే చైనాను వెనక్కి నెట్టిన భారత్ మొదటి స్థానంలో నిలిచింది. అయితే అధికారిక లెక్కలు మాత్రం ఇంకా విడుదల కాలేదు. ఈ క్రమంలో బ్లూమ్ బర్గ్ వర్గాలు జనగణనపై కీలక విషయాలను ప్రకటించాయి. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల తర్వాతే జనగణన ఉంటుందని తెలిపింది. అందుకు సంబంధించిన ఆర్థిక డేటా నాణ్యతను మెరుగుపరిచే మార్గాలను చర్చిస్తోందని వెల్లడించింది. చివరిసారిగా 2011లో జనగణన నిర్వహించారు. పదేళ్ల తర్వాత అంటే 2021లో జరగాల్సిన జనగణన వివిధ కారణాలతో జరగలేదు. 2024-25 మధ్యంతర బడ్జెట్‌లో జనాభా లెక్కల కోసం ప్రభుత్వం రూ. 1,277.80 కోట్లు కేటాయించింది. జనాభా గణనలో సుమారు మూడు లక్షల మంది పాల్గొనే అవకాశం ఉందని బ్లూమ్ బర్గ్ తెలిపింది. అంతే కాకుండా జనగణనకు దాదాపు 12 నెలల సమయం పట్టొచ్చని అంచనా వేసింది.

# ఢిల్లీ లిక్కర్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ




హైదరాబాద్ : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణంలో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. భారత్ రాష్ట్ర సమితి సీనియర్ నాయకురాలు, శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత నివాసంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు దాడులకు దిగారు. విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎన్నికల వేళ కలకలం.. లోక్‌సభ ఎన్నికలు సమీపించిన ప్రస్తుత పరిస్థితుల్లో సంభవించిన ఈ పరిణామం.. బీఆర్ఎస్‌లో కలకలం రేపుతోంది. ఈ ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనడానికి గులాబీ పార్టీ పావులు కదుపుతున్న ఈ పరిస్థితుల్లో– సాక్షాత్తూ బీఆర్ఎస్ చీఫ్, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ కుమార్తెపై ఈడీ కొరడా ఝుళిపించడం చర్చనీయాంశమౌతోంది. కవిత.. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఆరోపణలను ఎదుర్కొంటోన్న విషయం తెలిసిందే. ఇదే కేసులో రెండు మూడుసార్లు ఈడీ విచారణను ఎదుర్కొన్నారు కూడా.

ఆ తరువాత కూడా ఆమెకు నోటీసులు అందాయి. విచారణకు హాజరు కావాల్సి ఉంటుందంటూ నోటీసులు అందాయి. ఈ కేసును దర్యాప్తు చేస్తోన్న సీబీఐ అధికారులు సైతం కవితకు సమన్లను జారీ చేశారు. గతంలోనే ఆమె విచారణకు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ.. అలా జరగలేదు. ఆ తరువాత కవిత పేరును ఛార్జ్‌షీట్‌లో పొందుపరిచినట్లు వార్తలు సైతం వెల్లువెత్తాయి గతంలో. తాజాగా హైదరాబాద్‌లో కవిత నివాసంపై ఈడీ అధికారులు దాడులకు దిగడం అటు రాజకీయంగా కూడా చర్చనీయాంశమౌతోంది.

**కవిత అరెస్ట్..** సుమారు అయిదు గంటలకు పైగా సాగిన సోదాల అనంతరం ఈడీ అధికారులు కవితను అరెస్ట్ చేశారు. తొలుత ఆమెకు అరెస్టు నోటీసులను అందజేశారు. ఆ వెంటనే ఆమెను అదుపులోకి తీసుకున్నారు. కవిత అరెస్ట్ విషయాన్ని ఈడీ ఉన్నతాధికారులు ధృవీకరించినట్లు సమాచారం. ఢిల్లీకి తరలింపు.. కవితను అదుపులోకి తీసుకున్న ఈడీ అధికారులు ఆమెను ఢిల్లీకి తరలించనున్నారు. అక్కడి ప్రధాన కార్యాలయంలో విచారణ కొనసాగిస్తారని చెబుతున్నారు. ఢిల్లీకి తరలించి మరింత సమాచారాన్ని సేకరించాలనే ఉద్దేశంతోనే ఈడీ అధికారులు ఆమెను అదుపులోకి తీసుకున్నారని తెలుస్తోంది. ఇంటి వద్ద ఆందోళనలు.. ఈడీ అధికారులు సోదాలకు దిగినట్లు సమాచారం అందిన వెంటనే బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున కవిత నివాసానికి చేరుకున్నారు. ఈడీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నిరసనలకు దిగారు. ఆమె ఇంటి వద్దే బైఠాయించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా నినదించారు. ఈ ఘటనతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆమె ఇంటి వద్ద భారీగా బందోబస్తును మోహరింపజేశారు.

**అరెస్ట్ తర్వాత కవిత ఫస్ట్ రియాక్షన్ :** ఢిల్లీ లిక్కర్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేసిన ఈడీ.. ఢిల్లీకి తరలిస్తోంది. ఇవాళ ఉదయం నుంచి కవిత ఇంట్లో ఎంత సీన్ జరిగిందో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఈడీ అనుమతితో కవిత ఇంట్లోకి వెళ్లిన మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులు రచ్చ రచ్చ చేశారు. ఇదిగో అరెస్ట్ వారంట్ అంటూ నోటీసులు చూపించడం.. యాక్ట్‌కు సంబంధించిన వివరాలన్నీ చెప్పిన తర్వాత పరిస్థితి కాసింత అదుపులోనికి వచ్చింది. దీంతో ఢిల్లీకి కవితను ఈడీ బృందం తరలిస్తోంది. కవిత.. ఇంట్లోనుంచి బయటికి వస్తుండగా బీఆర్ఎస్ శ్రేణులు, నేతలు, అభిమానులు నినాదాలు, ఈలలు, కేకలతో హోరెత్తించారు. దీంతో ఈ అరెస్ట్ వ్యవహారంపై కవిత మొదటిసారిగా.. రెండే రెండు మాటల్లో స్పందించారు.

**కవిత అరెస్ట్‌పై ఈడీ అధికారులను నిలదీస్తున్న కేటీఆర్ :** కవిత అరెస్ట్ వార్త తెలుసుకున్న ఆమె అన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హుటాహుటిన నివాసానికి చేరుకున్నారు. మరోవైపు కవిత బావ, మరో మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు కూడా కవిత ఇంటికి చేరుకున్నారు. ఈడీ, ఐటీ అధికారులతో వారించి వీరిద్దరూ ఇంట్లోకి వెళ్లారు. కవితను ఎలా అరెస్ట్ చేస్తారంటూ ఐటీ, ఈడీ అధికారులను కేటీఆర్, హరీశ్ రావులు గట్టిగా ప్రశ్నించారు. ఈ క్రమంలో వాగ్వాదం కూడా జరిగింది. ట్రాన్సిట్ వారెంట్ లేకుండా ఎలా అరెస్టు చేస్తారంటూ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌ను కేటీఆర్ ప్రశ్నించారు. అరెస్టు చేయమంటూ సుప్రీంకోర్టుకు మాట ఇచ్చిన తర్వాత ఇప్పుడు ఎలా అరెస్టు చేస్తారని నిలదీశారు. సుప్రీంకోర్టులో చెప్పిన మాటను తప్పుతున్న మీ అధికారులు కోర్టు ద్వారా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

కావాలనే శుక్రవారం వచ్చారని, సోదాలు ముగిసిన తర్వాత కూడా ఇంట్లోకి రావద్దంటూ హుకుం జారీ చేస్తున్నారని ఐటీ అధికారులపైన కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కవితను ఈరోజు (శుక్రవారం) మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచే అవకాశం లేదంటూనే అరెస్టు చేశారని కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

**రాజకీయ కుట్రలో భాగమే ఎమ్మెల్సీ కవిత అరెస్టు: హరీశ్‌రావు –** రాజకీయ కుట్రలో భాగంగానే ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్టు చేసిందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. పార్టీ నేతలు, ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. “కవిత అరెస్టు అప్రజాస్వామికం, అక్రమం, అనైతికం. అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం. సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా.. శని, ఆదివారం కోర్టుకు సెలవు ఉంటుందని తెలిసి పథకం ప్రకారమే అరెస్టు చేశారు. మాపై బురదజల్లాలని, దెబ్బతీయాలని.. రాజకీయ దురుద్దేశంతో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. కవితను అరెస్టు చేస్తామని ఏడాదిన్నరగా భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రులు, ఎంపీలు, నాయకులు.. ఈడీ అధికారుల మాదిరిగా పలుమార్లు ప్రకటన చేశారు. రేపు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందనగా.. హడావిడిగా ఇవాళ అరెస్టు చేయడమంటే భారాస, కేసీఆర్‌ను అప్రతిష్ఠపాలు చేసే ప్రయత్నమే. పార్లమెంట్ ఎన్నికల్లో భారాసను దెబ్బతీయాలని భాజపా, కాంగ్రెస్ కుట్ర పన్నాయి. మాది ఉద్యమ పార్టీ. అరెస్టులు, వేధింపులు, కుట్రలు మాకు కొత్త కాదు. ఇలాంటివి ఎన్నో ఛేదించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాం. కవిత అరెస్టుపై రాజకీయంగా, న్యాయపరంగా ఎదుర్కొంటాం. న్యాయవ్యవస్థపై సంపూర్ణ విశ్వాసం ఉంది. దుర్మార్గ చర్యలపై భాజపా, కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదు” అని హరీశ్‌రావు అన్నారు.

## ఇన్నాళ్లు విచారణకు కవిత సహకరించలేదు: కిషన్‌రెడ్డి



హైదరాబాద్: భారాస ఎమ్మెల్సీ కవిత ఇంట్లో ఈడీ సోదాలపై కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి స్పందించారు. నేరం చేయనప్పుడు కవితకు భయమెందుకని ప్రశ్నించారు. ఈడీ విచారణకు కవిత సహకరించాలని సూచించారు.

ఇన్నాళ్లు విచారణకు సహకరించకుండా కవిత తప్పించుకుని తిరిగారని విమర్శించారు. సహకరించలేదు కాబట్టే..

ఈడీ ఆమె ఇంటికి వెళ్లిందన్నారు. కక్ష సాధింపు చర్యలకు దిగాల్సిన అవసరం భాజపాకు లేదని కిషన్‌రెడ్డి స్పష్టంచేశారు. విచారణ సంస్థలు తమ పని తాము చేసుకునిపోతాయన్నారు.




## భారీగా తరలివచ్చిన అభిమానులు

హైదరాబాద్: తెలంగాణలో భాజపా విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రోడ్‌షో నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌తో పాటు పలురు భాజపా నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మీర్జాలగూడ నుంచి మల్కాజిగిరి క్రాస్ వరకు దాదాపు 1.2 కిలోమీటర్ల మేర సుమారు గంట సేపు ఈ యాత్ర కొనసాగనుంది. కళాబృందాలు, ప్రజలు మోదీకి ఘన స్వాగతం పలికారు. రోడ్‌షో అనంతరం ప్రధాని రాజ్‌భవన్‌కు చేరుక్కున్నారు.

## అన్ని రంగాల్లో ముస్లిం మైనారిటీలకు సముచిత స్థానం



హైదరాబాద్: కాంగ్రెస్ హయాంలో ముస్లిం మైనారిటీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఎల్బీ స్టేడియంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. “ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్‌లు రద్దు చేయడం ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వల్ల కాదు. రిజర్వేషన్లు అమలు జరిగేలా చూసే బాధ్యత మాది. మైనారిటీ స్కూళ్లకు, రెసిడెన్షియల్స్ భవనాల కోసం ప్రభుత్వం ఇప్పటికే నిధులు విడుదల చేసింది” అని రేవంత్ తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ అసదుద్దీన్, షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ కుటుంబం భయపడుతోందా?

# కవిత పోటీ చేయడంలేదా...!?



హైదరాబాద్ : కేసీఆర్ అంటే ఓటమి ఎరుగని వారు అని ఒకప్పుడు అంతా అనుకునేవారు. ఆయనకు ఎదురెళ్ళినా లేక ఆయన ఎవరికైనా ఎదురెళ్ళినా వారికి పరాజయమే అన్నది రాజకీయంగా అంతా చెప్పుకునే పరిస్థితి ఉండేది. ఒక విధంగా చెప్పాలీ న్యూ మిలీనియం ఎంట్రీ ఇచ్చిన తర్వాత ఒక పాతికేళ్ల పాటు తెలుగు రాజకీయాలను ప్రత్యేకించి తెలంగాణా రాజకీయాలను కేసీఆర్ విశేషంగా ప్రభావితం చేసిన వారుగా ఉన్నారు. ఎన్నిక నుంచి ఎన్నిక ఇదే కేసీఆర్ విధానం. ఏ ఎన్నికకూ ఆయన కానీ ఆయన కుటుంబం కానీ ఎక్కడా భయపడిన సందర్భం లేదు. కానీ ఓడలు బళ్ళు అవుతాయన్న సామెత మాదిరిగా ఇపుడు అంతా గతం అయిపోయింది. అనూహ్యంగా బీఆర్ ఎస్ తెలంగాణా ఎన్నికల్లో ఓడాక గులాబీ పార్టీలో ఏదో తెలియని గుబులు మొదలైంది అని అంటున్నారు. దాంతోనే ఎంపీ ఎన్నికల వేళ ఆ పార్టీలో అనేక చిత్రాలు జరుగుతున్నాయి అని అంటున్నారు. ఇక బీఆర్ఎస్ పూర్వ రూపం అయిన టీఆర్ఎస్ ని 2001లో పెట్టిన దగ్గర నుంచి ఎంపీ ఎన్నికలకు కేసీఆర్ కుటుంబం దూరంగా ఎపుడూ లేదు. కేసీఆర్ అయినా లేకపోతే ఆయన కుమార్తె కవిత అయినా ఎంపీ అభ్యర్థులుగా పోటీ పడేవారు. కానీ ఫస్ట్ టైం 2024 ఎన్నికల్లో మాత్రం కవిత పోటీకి దూరంగా ఉంటున్నారు. మొత్తం 17 ఎంపీ సీట్లు ఉన్న తెలంగాణాలో అభ్యర్థుల ఎంపిక చేస్తున్న కేసీఆర్ కవిత పోటీ చేసే సీటుకు కూడా వేరే అభ్యర్థులను ఎంపిక చేయడం చర్చనీయాంశం అవుతోంది. ఇది నిజంగా ఆశ్చర్యకరం అని అంటున్నారు. ఎందుకు ఇలా చేస్తున్నారు అంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి అలాగే ప్రధాని మోడీకి వారి పార్టీలకు కేసీఅర్ కుటుంబం భయపడుతోందా అన్న చర్చ కూడా వాడిగా వేడిగా సాగుతోంది. అటు చూస్తే దూకుడు మీద ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఇటు చూస్తే హ్యాట్రిక్ పీఎం కావాలంటూ అందులో తెలంగాణా వాటా బీజేపీకి తేల్చడానికి వస్తున్న ప్రధాని మోడీ ఇలా ఈ ఇద్దరూ తమ పార్టీలతో సిద్ధంగా ఉండడంతో బీఆర్ఎస్ నుంచి కవిత పోటీకి దూరంగా ఉంటోందా అన్నది పెద్ద ఎత్తున తెలంగాణా వ్యాప్తంగా చర్చ సాగుతోంది. ఇక చూస్తే కేసీఆర్ కుటుంబానికి అచ్చి వచ్చిన మెదక్ నుంచి అయినా కేసీఆర్ కుటుంబం ఎంచుకుని పోటీ చేయవచ్చు కదా అన్న ప్రశ్నలు వస్తున్నాయి. ఇక్కడ పోటీ చేస్తే గెలుస్తాం అన్న నమ్మకం ఉంటే పోటీకి ఎందుకు దిగడం లేదు అన్నది కూడా సందేహంగా ఉంది. కవిత ఈసారి ఎంపీగా పోటీ చేస్తుంది అదే మెదక్ ఎంపీ సీటు అని కూడా అంతా అనుకున్నారు. తీరా చూడబోతే అక్కడ కూడా బీఆర్ఎస్ ఎంపీ క్యాండిడేట్ డిసైడ్ అయ్యారు. మరి కవిత పోటీ చేయడం లేదు అంటే ఎలా చూడాలి ఎలా అర్థం చేసుకోవాలి అన్నదే ఇపుడు సాగుతున్న చర్చ. నిజానికి చూస్తే ఎంపీ ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబం ఏదో ఒక చోటన పోటీ చేస్తే మొత్తం బీఆర్ఎస్ శ్రేణులకు నైతిక స్థైర్యం వస్తుంది. ఇటీవల మొత్తం ఓడి పూర్తిగా నైరాశ్యంలోకి వెళ్లిపోయిన పార్టీ శ్రేణులకు కూడా ఒక ధైర్యం వస్తుంది అని అంతా అనుకున్నారు. ఇక కవిత అంటే ఎంపీగా పోటీ చేస్తుంది అని అంతా అనుకున్నారు. కానీ ఆమె పోటీకి దూరం అంటే బీఆర్ఎస్ కి ఎక్కడో ఏవో డౌట్లు ఉన్నాయా అన్నదే చర్చగా ఉంది. రాజకీయాలలో ఎదురు నిలిచి పోరాడడం అని నేర్పించిన కేసీఆర్ ఇపుడు తన రూట్ ని తానే మరచిపోయారా అన్నది కూడా సందేహంగా ఉంది. కేసీఆర్ అంటే దేనికీ వెరవరు, ఏటికి అయినా ఎదురీదుతారు అని ఉద్యమకాలంలో అనుకున్నారు. ఆ తరువాత పదేళ్ళ పాటు సీఎం గా అలాగే ఆయన శాసించారు. ఇపుడు ఒకే ఒక్క ఎన్నిక ఇలా ఎందుకు చేసింది అన్నదే చర్చ. అయితే కేసీఆర్ కుటుంబం పోటీకి దిగకపోవడానికి కారణాలు ఉన్నాయని అంటున్నారు. అందులో వ్యూహాలు ఉన్నాయని అంటున్నారు. కవిత ఎక్కడైనా పోటీ చేస్తే అటు కాంగ్రెస్ ఇటు బీజేపీ రెండూ కూడా అక్కడ ఫుల్ ఫోకస్ పెడతాయని ఓడించేందుకు పట్టుదలగా పనిచేస్తాయని ఆలోచించే ఈ విధంగా జాగ్రత్తలు తీసుకున్నారు అని అంటున్నారు. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి భారం కొండలా ఉంది. దానికి సాయం అన్నట్లుగా కేసీఅర్ కుటుంబ సభ్యులు వ్యక్తిగతంగా మరోసారి ఓటమి పాలు అయితే అది పార్టీకి బిగ్ డ్యామేజ్ చేస్తుంది అని ఆలోచించే ఈ రిస్క్ కి వారు దూరంగా ఉంటున్నారు అని అంటున్నారు. చూడాలి మరి ఈ ప్రచారంలో ఎంతవరకూ నిజం ఉందో.

# సంపాదకీయం

## బీజేపీకి వలసనేతలే దిక్కా ?

రాష్ట్ర బీజేపీ పరిస్థితి ఇలా తయారైంది. విషయం ఏమిటంటే రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఆరు ఎంపీ స్థానాల్లో పోటీ చేయబోతున్న విషయం తెలిసిందే. టీడీపీ, జనసేనతో పొత్తు కారణంగా కమలం పార్టీ ఆరు పార్లమెంటు స్థానాలకే పరిమితమవ్వాల్సొచ్చింది. పోటీచేయబోయే స్థానాలను పార్టీ అధికారికంగా ప్రకటించలేదు. అయితే పార్టీ వర్గాల సమాచారం ప్రకారం అరకు, అనకాపల్లి, రాజమండ్రి, ఏలూరు, నరసాపురం, రాజంపేట నియోజకవర్గాల్లో పోటీ దాదాపు ఖాయమైందని సమాచారం. పైగా ఆరుస్థానాల్లో మూడింటిని మార్చుకుని విశాఖపట్నం, విజయవాడ, హిందుపురం సీట్లు కావాలని చంద్రబాబుతో బీజేపీ మంతనాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇక్కడ విషయం ఏమిటంటే పార్టీ పోటీచేయబోయే సీట్లు ఏవి అన్న విషయాలను పక్కనపెట్టేస్తే అభ్యర్థులు మాత్రం ఎక్కువమంది వలసనేతలే ఉంటారన్నది ఖాయమైపోయింది. పార్టీలో మొదటినుండి పనిచేస్తున్న సీనియర్లను కాదని ఈమధ్యనే పార్టీలో చేరినవారిని ఇంకా చేరని వారికే టికెట్లంటు మీడియాలో జరుగుతున్న ప్రచారంపై చాలామంది సీనియర్లు మండిపోతున్నారు. ఇలాంటి వలసనేతలకు ఎట్టి పరిస్థితుల్లోను టికెట్లు ఇవ్వకూడదని సీనియర్లలో చాలామంది గట్టిగా వాదిస్తున్నారట. అరకు నుండి కొత్తపల్లి గీత పోటీచేస్తారంటున్నారు. ఈమె వైసీపీ ఎంపీగా పనిచేశారు. భూకబ్జా కేసులో తెలంగాణా పోలీసులు అరెస్టు చేస్తే బెయిల్ మీద బయటున్నారు. అనకాపల్లి సీటులో సీఎం రమేష్ పోటీచేస్తారని ప్రచారం జరుగుతోంది. రాజమండ్రి లేదా పురందేశ్వరి పోటీకి రెడీ అవుతున్నట్లు సమాచారం. సరే, ఈమె అధ్యక్షురాలు కాబట్టి వలస నేతే అయినా టికెట్ ఇవ్వక తప్పదు. మరి ఆమె పోటీచేయని రెండోసీటులో సుజనాచౌదరి, నరసాపురంలో రఘురాజు, రాజంపేటలో మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి పోటీచేస్తారని అంటున్నారు. పురందేశ్వరి విషయాన్ని మినహాయిస్తే మిగిలిన నేతలను పార్టీలో తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పొత్తులు, సీట్ల సర్దుబాటు సందర్భంగా నోరెత్తని పార్టీలోని చాలామంది సీనియర్లు ఇపుడు సడెన్ గా పార్టీ అగ్రనేతల తీరుపైన, పోటీచేయబోతున్న ఆశావహుల పేర్లపైన గోల చేస్తుండమే ఆశ్చర్యంగా ఉంది. అగ్రనేతలు తాము అనుకున్నట్లుగా పై నేతలనే పోటీలోకి దింపుతారా ? లేకపోతే వీళ్ళ వాదనను పరిగణలోకి తీసుకుని జీవీఎల్ నరసింహారావు, సోమువీర్రాజు, సీతారామంజనేయుల చౌదరి లాంటి వాళ్ళకి అవకాశాలు ఇస్తారా అన్నది చూడాలి.

# పరిశోధనలకు సాన.. విత్తనోత్పత్తి భళా..!



మధిర : ఒక కొత్త వంగడాన్ని రూపొందించి విడుదల చేయటానికి 15 ఏళ్ల పాటు శాస్త్రవేత్తలు శ్రమించాలి. అలాంటి వంగడాలనెన్నో సృష్టించిన ఘనత మధిర వ్యవసాయ పరిశోధన స్థానానికి దక్కింది. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై పరిశోధనలు సాగిస్తూ.. కొత్త వంగడాలు సృష్టిస్తూ అన్నదాతలకు అండగా నిలుస్తోంది. తొలినాళ్లలో పొగాకుకు పరిమితమైన పరిశోధనలు తరువాత జొన్న, అపరాలకు విస్తరించాయి. పదేళ్లుగా అధిక విత్తనోత్పత్తి సాధిస్తూ మధిర వ్యవసాయ పరిశోధన స్థానం తెలంగాణ రాష్ట్రానికి వరప్రదాయినిగా మారింది. 1945లో 17.26 హెక్టార్ల విస్తీర్ణంలో పరిశోధన స్థానం ఏర్పాటైంది. 1960 వరకు పొగాకుపై పరిశోధనలు జరిగాయి. 1960-61లో మాగీ జొన్నపై పరిశోధించారు. ఈ రకాన్ని రైతులు ఆగస్టులో విత్తుకుంటారు. 1971 నుంచి అపరాలు ఎంఆర్‌జీ (మధిర కంది రకం), ఎంజీజీ (మధిర పెసర రకం), ఎంబీజీ (మధిర మినుము రకం) మీద పరిశోధనలు జరుగుతున్నాయి. 2014 నుంచి ఇక్కడ తయారవుతున్న కొత్త వంగడాలు తెలంగాణ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయి. తెగుళ్లను తట్టుకొని అధిక దిగుబడులు సాధించే రకాలను అధికారులు సృష్టిస్తుండటం విశేషం.

### నిరంతర పరిశోధనలు

కేంద్రంలో నలుగురు శాస్త్రవేత్తలున్నారు. ప్రధాన శాస్త్రవేత్త కె.రుక్మిణీదేవి పర్యవేక్షణలో నిరంతరం పరిశోధనలు సాగుతున్నాయి. ఇద్దరు బ్రీడర్, ఒకరు కీటక శాస్త్రవేత్తతో పాటు నలుగురు ఏఈఓలు, ఒక ఏఓ, ఆఫీస్ సిబ్బంది- ఇద్దరు, 34 మంది టైంస్కేలు వర్కర్లు పనిచేస్తున్నారు. పరిశోధన స్థానానికి అనుబంధంగా సాంకేతిక కళాశాలను 2013లో ఏర్పాటు చేశారు. ఇక్కడి శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తూనే కళాశాలలో బోధిస్తున్నారు.

### నూతన వంగడాల సృష్టి

జొన్న: మోతీ, కిన్నెర రకాల వంగడాలు సృష్టించారు. ఇవి ప్రాచుర్యం పొందాయి. వీటిని జొన్నరొట్టెలు, పశుగ్రాసం కోసం వినియోగిస్తున్నారు.

కంది: ఎంఆర్‌జీ 66, ఎంఆర్‌జీ 1004 మధ్యకాలిక రకాలు. ఇవి మ్యాక్రోఫోమినా ఎండుతెగులును తట్టుకుంటాయి.

పచ్చపెసర: ఐదు రకాలు విడుదల చేశారు. ఎంజీజీ 295, ఎంజీజీ 347 (మధిర పెసర), ఎంజీజీ 348(భద్రాద్రి), ఎంజీజీ 351(శ్రీరామ), ఎంజీజీ 385(మధిర పెసర01) రకాలు.

మినుము: ఎంబీజీ 207, ఎంబీజీ 1070 రకాలు విడుదల చేశారు. చీడపీడలు తట్టుకొని అధిక దిగుబడులు ఇచ్చే పెసర, మినుము రకాలు రూపొందించారు. అధిక మొత్తంలో నూతన వంగడాలను ఉత్పత్తి చేసి టీఎస్‌ఎస్‌డీసీ, నేషనల్ సీడ్ కార్పొరేషన్ ద్వారా రైతులకు అందజేస్తుంటారు.

నాణ్యమైన విత్తనోత్పత్తి ద్వారా పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచటమే లక్ష్యం. ఎంజీజీ 453, ఎంజీజీ 519, ఎంబీజీ 1110, ఎంబీజీ 1133 రకాలు పరీక్షలు పూర్తిచేసుకొని విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. ఎంజీజీ 389, ఎంబీజీ 1080 రకాలకు రెండో ఏడాది చిరు సంచుల రూపంలో పరీక్షలు జరుగుతున్నాయి.డాక్టర్ కె.రుక్మిణీదేవి, ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త

# నైనీ బ్లాకుకు రైల్వే సైడింగ్ నిర్మాణం



కొత్తగూడెం : ఒడిశా రాష్ట్రం అంగోల్ జిల్లాలోనున్న నైనీ బ్లాకులో ఉత్పత్తయ్యే బొగ్గు రవాణా చర్యలపై సింగరేణి యాజమాన్యం దృష్టిపెట్టింది. కొంతదూరం రైల్వే మార్గం ఏర్పాటు దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. నైనీ బొగ్గు బ్లాకును కేంద్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు కేటాయించిన సంగతి తెలిసిందే. ఆ బ్లాకుకు ప్రత్యేక ప్రాజెక్టు అధికారిని నియమించి యాజమాన్యం కొంతకాలంగా ఉత్పత్తికి సన్నాహాలు చేస్తోంది. డిసెంబరు నుంచి బొగ్గు వెలికితీయనుంది. కోల్‌బ్లాకులో 340 మిలియన్ టన్నుల నిక్షేపాలుండగా.. ఏటా 100 లక్షల టన్నులు ఉత్పత్తి చేయనున్నారు. గని జీవిత కాలం 38 ఏళ్ళుగా నిర్ధారించారు.

బ్లాకు ప్రారంభమైతే కొన్నాళ్లు బొగ్గును రోడ్డు రవాణా ద్వారా ఉత్పత్తి చేసేందుకు సింగరేణి సన్నాహాలు చేస్తోంది. కానీ దీర్ఘకాలంలో ఈ రవాణా అత్యంత వ్యయంతో కూడుకున్నది కావడంతో శాశ్వత రైల్వే లైన్ అనివార్యం కానుంది. ఈ నేపథ్యంలో అదే ప్రాంతంలోని తమ గనులకు కోలిండియా సంస్థలు ఏర్పాటు చేసుకోనున్న రైల్వే మార్గాన్ని వినియోగించుకునేందుకు సింగరేణి సన్నాహాలు చేస్తోంది. నైనీ బ్లాకు మీదుగానే కొద్దిదూరంలో కోలిండియాకు చెందిన కంపెనీలు తమ గనులకు రైలుమార్గాన్ని నిర్మించతలపెట్టాయి. అక్కడి వరకు రైల్వే సైడింగ్ పనులను చేపట్టేందుకు తాజాగా సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. ఇందుకోసం రైల్వే బోర్డు అనుమతి తీసుకోవాలి. అనుమతి లభిస్తే నైనీ బ్లాకులో ఉత్పత్తయ్యే బొగ్గును రైల్వే మార్గం ద్వారా రవాణాకు వీలుకలుగుతుంది.

### కొత్తమార్గానికి రైల్వేశాఖ పచ్చజెండా

ఒడిశా రాష్ట్రం అంగోల్ జిల్లాలోని తాల్చేరు కోల్‌ఫీల్డ్స్‌లో కేంద్రం సింగరేణితో పాటు కోలిండియాకు చెందిన మరో నాలుగు సంస్థలకు బొగ్గు బ్లాకులను కేటాయించింది. వీటిలో మహానది కోల్‌ఫీల్డ్స్, నేషనల్ అల్యూమినియం కార్పొరేషన్(నాల్కో), ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ (ఓఎంసీ), ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఒడిశా (ఇడ్కో) ఉన్నాయి. ఆ సంస్థలు రైలు మార్గం నిర్మాణం విషయమై కేంద్రంతో సంప్రదింపులు జరిపాయి. అంగోల్ వరకు ఉన్న రైలు మార్గాన్ని తమ బొగ్గు బ్లాకుల గుండా పొడిగించాలన్న విజ్ఞప్తికి కేంద్ర రైల్వే శాఖ అంగీకరించింది. కొత్త మార్గంలో బలరాం, తెంతులోయి, జార్పాండా వరకు రైల్వేలైన్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ రైల్వే లైన్‌ను జార్పాండాకు కొద్ది దూరంలోనే ఉన్న నైనీ బొగ్గు బ్లాకు వరకు పొడిగించాల్సిందిగా సింగరేణి సైతం రైల్వే శాఖను కోరింది. కానీ అందుకు రైల్వేశాఖ అంగీకరించకపోవడంతో కొద్దిదూరం మేర సొంతంగా రైల్వే సైడింగ్ నిర్మాణ పనులు చేపట్టాలని యాజమాన్యం నిర్ణయించింది. జాయింట్ వెంచర్‌గా ఏర్పడి రైల్వే లైనును సాధించుకున్న మిగతా కంపెనీలు సింగరేణితో కలిసేందుకు నిరాకరించాయి. భాగస్వామిగా కాకుండా రైల్వే రవాణా ఛార్జీల చెల్లింపు పద్ధతిపై జాయింట్ వెంచర్ మార్గం సేవలను వినియోగించుకునేందుకు సింగరేణి నిర్ణయం తీసుకుంది. ఈలోగా సొంత వ్యయంతో రైల్వే సైడింగ్ పనులు చేపట్టాల్సి ఉంటుంది.

# తాలిపేరు.. నిర్వహణ మరిచారు!

కొత్తగూడెం : వేసవిలో చేపట్టాల్సిన ప్రాజెక్టు నిర్వహణ (మెయింటెనెన్స్) పనులను అధికారులు పట్టించుకోలేదు. ఏటా మే నెలలో ప్రాజెక్టు నిర్వహణ పనులు పూర్తిచేసి ఖరీఫ్‌కు ముందే సాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలి. గేట్ల ఆపరేషన్, గ్రీజింగ్, మెకానికల్, విద్యుద్దీకరణ, ఇతరత్రా సవ్యంగా ఉండేలా మరమ్మతులు చేపట్టాలి.తొలకరి పలకరింపునకు వేళయినా ఇప్పటికీ చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టు నిర్వహణ పనుల్లో తీవ్ర జాప్యం నెలకొంది. 25 గేట్ల ఆపరేషన్‌కు సంబంధించి రోప్ ఆయిలింగ్, గ్రీజింగ్, బేరింగ్, మోటర్ మరమ్మతులు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ప్రాజెక్టు గేట్లు ఎత్తలేదు. గేట్ల పనితీరునూ పరిశీలించలేదు.

### మెకానిక్ పనులకు మోక్షమేదీ?

ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లకు సంబంధించిన బ్రేకర్లు మరమ్మతులకు గురయ్యాయి. ఏటా వరదల సమయంలో గేట్లు ఎత్తేందుకు సిబ్బందికి తంటాలు తప్పటం లేదు. ప్రాజెక్టుకు ఇటీవల కొత్త 125 కేవీఏ జనరేటర్ సమకూర్చారు. స్టాండ్‌బైగా ఉన్న 35 కేవీఏ జనరేటర్‌కు మరమ్మతులు, క్రషర్ గేట్ల బేరింగ్, వెల్డింగ్ పనులు ఇప్పటికీ మొదలుకాలేదు. గ్యాలరీలో లీకేజీలను అరికట్టే గ్రౌటింగ్ పనులకు ఏళ్ల తరబడి మోక్షం లభించటం లేదు.

### హెడ్ రెగ్యులేటర్ గేట్లు, ఈఎం బ్రేక్స్ మారేనా..!

ప్రాజెక్టు ప్రధాన ఎడమ, కుడి కాల్వల హెడ్ రెగ్యులేటర్ల గేట్లు సవ్యంగా పనిచేయటం లేదు. ప్రధాన కుడి కాల్వ హెడ్ రెగ్యులేటర్ షట్టర్లను మార్చాలి. గేట్లు లేవకపోవటంతో నీటి విడుదల సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రాజెక్టు 25 గేట్లకు సంబంధించిన ఈఎం (ఎలక్ట్రో మ్యాగ్నటిక్) బ్రేక్స్ కొన్నేళ్లుగా పనిచేయటం లేదు. ఏటా వరదల సందర్భంలో గేట్లు



ఎత్తేందుకు సిబ్బంది తంటాలు పడుతున్నారు. ఎగువ నుంచి ఎప్పుడు భారీగా వరద వస్తుందో తెలియక.. ఈఎం బ్రేక్స్ పనిచేయక.. కట్టెలు అడ్డంగా పెట్టి సిబ్బంది గేట్లు ఎత్తాల్సిన దుస్థితి దాపురించింది. వాటి నిర్వహణ మరింత క్లిష్టంగా మారుతోంది.

కాల్వలకు సంబంధించి ఓఅండ్‌ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) పనులు జరుగుతున్నాయి. జనవరి, ఫిబ్రవరిలోనే గ్రీజింగ్ చేశాం. పుల్లీ బేరింగ్‌లు అమర్చుతాం. ప్రధాన ఎడమ, కుడికాల్వల హెడ్ రెగ్యులేటర్ల షట్టర్లు నుంచి నీరు లీకవుతోంది. వాటి స్థానంలో కొత్తగా షట్టర్ల ఏర్పాటు ప్రక్రియను వారంలో ప్రారంభిస్తాం. నిర్వహణ పనుల్లో భాగంగా గతంలోనే రోప్ ఆయిలింగ్ చేశాం. లిమిట్ స్విచ్‌లు, ఈఎం బ్రేక్స్‌ను త్వరలోనే అమర్చుతాం.తిరుపతి, డీఈ

# సోమేశ్వరాలయంలో సిబ్బంది ఇష్టారాజ్యం

వరంగల్ : రాష్ట్రంలోని ప్రముఖ శైవక్షేత్రాల్లో పాలకుర్తిలోని సోమేశ్వరాలయం ఒకటి. ఇక్కడి క్షీరాద్రిపై సోమేశ్వరుడు, లక్ష్మీనరసింహస్వామి స్వయంభువులుగా వెలిశారు. అంతేకాక పర్యాటకాభివృద్ధిలో భాగంగా ఈ ఆలయ పరిసరాల్లో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. కానీ సోమేశ్వరాలయంలో దేవాదాయశాఖ సిబ్బంది, అర్చకుల పనితీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఓ ఉద్యోగిని సస్పెండ్ చేశారు. ఆలయంలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా సిబ్బంది వ్యవహరిస్తుంటారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### విధుల్లో నిర్లక్ష్య ధోరణి

ఆలయంలో పనిచేసే కొందరు సిబ్బంది, అర్చకులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొందరు విధులకు రాకుండానే రిజిస్టర్‌లో సంతకాలు చేస్తారని, మరికొందరు ఎలాంటి సమాచారం లేకుండానే విధులకు గైర్హాజరవుతారు. ఓ ఉద్యోగి ముందస్తు సమాచారం లేకుండా కొన్ని రోజులు విధులకు రాలేదు. దీంతో ఈవో లక్ష్మీప్రసన్న నోటీసులు జారీ చేశారు. ఉద్యోగి నుంచి వివరణ రాకపోవడంతో సస్పెండ్ చేశారు. అర్చకులు సైతం సక్రమంగా విధులు నిర్వర్తిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వారి స్థానంలో ఇతరులను విధుల్లో ఉంచుతారని,



నిత్య పూజల విషయంలోనూ జాప్యం చేస్తుంటారని తెలిసింది. ఆలయాన్ని తెరవడం, మూసివేయడంలోనూ కాలయాపన చేస్తుంటారని సమాచారం. ఆలయంలో మొత్తం సిబ్బంది సుమారు 26 మంది ఉన్నారు. వాహనాలను కూడా క్షీరాద్రిపై అస్తవ్యస్తంగా పార్కింగ్ చేస్తుంటారు.జాతరకు రెట్టింపు ఖర్చులు

సోమేశ్వరాలయంలో ఏటా మహాశివరాత్రి జాతరను వైభవంగా నిర్వహిస్తారు. ప్రతిసారీ జాతరకు సుమారు రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఖర్చు చేస్తారు. ఈసారి ఆయా ఖర్చులు రెట్టింపయ్యాయి. సుమారు రూ.20 లక్షలకు పైగానే ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో ఓ ఉన్నతాధికారి ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రజాప్రతినిధుల ఒత్తిడితోనే ఖర్చులు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అధికారులు వాపోయారు. చండికా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనకు సైతం భారీగా ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

### గణనీయంగా అభివృద్ధి

అభివృద్ధిపరంగా సోమేశ్వరాలయ రూపురేఖలు మారాయి. గర్భగుడితో పాటు క్షీరాద్రి ఆలయ ప్రాంగణం, మెట్ల సుందరీకరణ, కల్యాణ మండపాన్ని అభివృద్ధి చేశారు. పర్యాటకాభివృద్ధిలో భాగంగా ఈ పనులు చేపట్టారు. ప్రభుత్వం వీటికి అదనపు నిధులు సైతం కేటాయించింది. కొందరు అధికారులు, అర్చకులు ఆలయంలో అవసరం లేని పనులు చేయించారని సిబ్బంది చర్చించుకుంటున్నారు. బుకింగ్ కేంద్రాన్ని ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదు. నవగ్రహాలను రక్షణ లేదని భక్తులు చెబుతున్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు- లక్ష్మీప్రసన్న, ఈవో, సోమేశ్వరాలయంఅధికారులు, సిబ్బంది, అర్చకులు ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు. ఇటీవల ఈ విషయంలో ఉద్యోగిని కూడా తప్పించాను. ఎవరి విధులు వారు నిర్వహించాల్సిందే. సీసీ కెమెరాల దృశ్యాల ద్వారా నిత్యం ఆలయంలో జరిగే కార్యక్రమాలు, చర్యలను పర్యవేక్షిస్తుంటా.

# నగరంలో ఇక మురుగు కంపే!

వరంగల్ : స్మార్ట్‌సిటీ పథకంలో ప్రతిపాదించిన కీలకమైన ప్రాజెక్టులు ఒక్కొక్కటి చేజారుతున్నాయి. భవిష్యత్తు అవసరాల కోసం ప్రతిపాదించిన ముఖ్యమైన పనులు పక్కకు నెట్టేస్తున్నారు. ఇప్పటికే ప్రజా రవాణా సౌకర్యాలు మెరుగుకు రూపొందించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్) మరుగున పడ్డాయి. తాజాగా హనుమకొండ రెడ్డిపురం చెరువు వద్ద ప్రతిపాదించిన రోజుకు 100 మిలియన్ లీటర్ల మురుగు నీటి శుద్ధీకరణ కేంద్రం(ఎస్టీపీ) పనులు రద్దు చేశారు. సుమారు రూ.200 కోట్లతో టెండర్లు పిలిచినప్పటికీ స్థలాలు లభించడం లేదంటూ పక్కకుపెట్టేశారు. ఇప్పటికే డంపింగ్ యార్డులోని చెత్తతో కంపు కొడుతున్న నగరానికి మురుగు కూడా తోడవనుంది.

స్మార్ట్‌సిటీ పథకంలో మురుగునీటి శుద్ధీకరణ అంశం కీలకం. రెడ్డిపురంలో 100 ఎంఎల్‌డీలు, కాజీపేట బంధం చెరువు వద్ద 15 ఎంఎల్‌డీలు, ఉర్సు చెరువు వద్ద 5 ఎంఎల్‌డీల ఎస్టీపీలు డిజైన్ చేశారు. కాజీపేట, ఉర్సు చెరువు వద్ద నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రద్దు చేసిన రెడ్డిపురం ప్రాజెక్టు నిధులను ప్రజాప్రతిధులు సూచించిన దగ్గర కొత్తగా ప్రతిపాదించారని తెలిసింది. ఆధునిక, సాంకేతిక ప్రాజెక్టులు అమలయ్యేలా చూడాల్సిన ప్రాజెక్టు మానిటరింగ్ కమిటీ (పీఎంసీ) నిపుణులు ఏమీ పట్టనట్లుగా ఉంటున్నారనే విమర్శలున్నాయి.

### చెరువులు కలుషితం

వరంగల్ త్రినగరి నుంచి వెలువడుతున్న మురుగునీటితో ఇప్పటికే చెరువులు, కుంటలు కలుషితమవుతున్నాయి. నగర శివారులోని నాగారం, రెడ్డిపురం, ములుగురోడ్ కోట చెరువు, దేశాయిపేట చిన్నవడ్డేపల్లి చెరువులను మురుగు ముంచెత్తుతోంది. సమీపంలో ఉన్న కాలనీల్లో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. బోర్లు, మంచినీటి బావుల్లో రంగు మారిన నీళ్లు వస్తున్నాయని స్థానిక ప్రజలంటున్నారు. రంగశాయిపేట బెస్తం చెరువు, మద్దెలకుంట, న్యూశాయంపేట కోటి చెరువు, గొర్రెకుంట కట్టమల్లన్న చెరువులకు మురుగు చేరుతోంది.

నగరంలో వెలువడే మురుగులో ఎక్కువ శాతం నాగారం చెరువులోకి వెళ్తాయి. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని నిపుణుల కమిటీ హెచ్చరించింది. చెరువులు, కుంటలు కలుషితం కాకుండా చూడాల్సిన గ్రేటర్ వరంగల్ పాలకులు పట్టింపు లేకుండా ఉంటున్నారు.

### రోజూ 120 ఎంఎల్‌డీలు

త్రినగరి నుంచి ప్రతి రోజూ 120 మిలియన్ లీటర్ల మురుగు నీరు వస్తుంటుంది. వచ్చే పదేళ్ల నాటికి 150-180 ఎంఎల్‌డీలకు చేరుకుంటుందని అంచనా. చిన్న చిన్న పట్టణాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, తగినన్ని మురుగునీటి శుద్ధీకరణ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. వరంగల్‌లో చూస్తే ఈ రెండూ లేని లోటుతో ప్రజలు కంపును భరాయించాల్సి వస్తోంది.

# మందకొడిగా ఆస్తి పన్నుల వసూళ్లు

జనగామ : పురపాలికలకు ఆస్తి, నల్లా తదితర పన్నుల రూపేణా వచ్చే ఆదాయమే ప్రధాన వనరు. కార్యాలయ నిర్వహణ, పారిశుద్ధ్యం, నీటిసరఫరా తదితర పౌరసేవల నిర్వహణకు, ఒప్పంద కార్మికుల వేతన చెల్లింపులకు పన్నుల ద్వారా వచ్చే ఆదాయమే ఆధారం. జనగామ పురపాలిక పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నుల వసూళ్లు ఆశించిన రీతిలో జరగడం లేదు. పన్నుల రూపేణా వసూలయ్యే సొమ్ములో కనీసం రెండు మూడు మాసాల వేతనాలకు సరిపోయే నిధులను సాధారణ నిధుల ఖాతాలో జమచేసి, ఇతర ఖర్చులకు వెచ్చించాలనే నిబంధన ఉంది. వసూళ్లు ఆశించిన రీతిలో జరగడం లేదనే కారణంతో జనగామ మున్సిపల్ ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులకు గత రెండు మాసాలుగా వేతనాలు ఇవ్వడం లేదు. గత ఆరు మాసాలుగా ఒక నెల వేతనం బకాయి ఉంటోంది. పన్నుల వసూళ్ల లక్ష్యం సాధించాల్సిన మార్చి నెలలోనూ వారికి వేతనాలు ఇవ్వకపోవడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. జనవరి, ఫిబ్రవరి మాసాల వేతనాల కోసం జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, పాలకవర్గం ముందు తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు.

వడ్డీపై 90 శాతం రాయితీ ఉన్నా..

మున్సిపల్ పరిధిలోని ప్రైవేటు ఆస్తుల మీద గత బకాయిలు, వాటిపై వడ్డీ, ప్రస్తుత వార్షిక పన్ను మొత్తం రూ.5 కోట్ల 25 లక్షలు లక్ష్యం. ఇందులో గత బకాయిలు రూ.86.09 లక్షలు, వాటిపై జరిమానా రూ.76.04లు వసూలు కావాల్సి ఉండటం గమనార్హం. 2022-



23 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలు, వడ్డీ సహా ఏక మొత్తంలో చెల్లించే వారికి వడ్డీపై 90 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించినా పన్ను చెల్లింపుదారులు ముందుకు రావడం లేదు. పండగలు, మేడారం జాతర, ఇప్పుడు బిడ్డల చదువుల ఫీజులను కొందరు కారణాలుగా చూపుతున్నారు. మరికొందరు తమ కాలనీల్లో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదని నిలదీస్తున్నారు.

మొండి బకాయిలు..జనగామ మున్సిపల్ పరిధిలో పేద, మధ్య తరగతి వర్గాల నుంచి పన్నుల వసూళ్లకు వత్తిడి పెంచుతున్నారు. 80 ప్రభుత్వ భవనాల పన్ను, వడ్డీ బకాయిలు రూ.95.32 లక్షలు వసూలు కావాల్సి ఉంది. ఆర్డీవో, తహసిల్, టెలిఫోన్‌భవన్, విద్యుత్తు, ఆర్టీసీ, పోలీసు తదితర శాఖల భవనాల ఆస్తి పన్ను రావడం లేదు. రూ.34 లక్షలు పన్ను బకాయిలుంటే, రూ.49 లక్షల మేర అపరాధ రుసుము బకాయిలున్నాయి. వడ్డీ మాఫీ రాయితీని ఉపయోగించుకుంటే, ప్రభుత్వ ఆస్తులపై పన్ను చెల్లింపు భారం తగ్గుతుంది. ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారులు చొరవ చూపాల్సి ఉంది.

ఈ నెల 7వరకు ఇవీ వివరాలు

ప్రైవేటు ఆస్తులు- 14694, బకాయిలతో కలిపి డిమాండ్- రూ.5కోట్ల 25 లక్షలు, వసూలు- 2కోట్ల 60 లక్షలు (49.61శాతం), బ్యాలెన్స్- 2కోట్ల 65 లక్షలు.

ప్రభుత్వ ఆస్తులు-80, గత పన్ను బకాయిలు-రూ.34.71లక్షలు, జరిమాన-రూ.49.94లక్షలు, ప్రస్తుత వార్షిక పన్ను-రూ.9.69 లక్షలు, దీనిపై వడ్డీ-96980.

మొత్తం పెండింగ్‌లో- రూ.95,332,501.

# ఆ రెండు ఆదర్శం

కొత్తగూడ : గ్రామ పంచాయతీ పన్నుల వసూళ్లలో ఏజెన్సీలోని మారుమూల మండలం గంగారం సహా నియోజకవర్గ కేంద్ర మండలం డోర్నకల్ వందశాతం లక్ష్యాన్ని చేరుకున్నాయి. ఏజెన్సీలోని మరో మండలమైన కొత్తగూడలో ప్రభుత్వ కార్యాలయాలు మినహా ఇళ్ల యజమానులందరూ పన్ను చెల్లించారు. పంచాయతీలు వసూలు చేసే పన్నులో జిల్లాలోని మారుమూల ఏజెన్సీ గ్రామాలు ఆదర్శంగా నిలిచాయి. నూరుశాతం పన్నును వసూలు చేసి జిల్లాలో మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.

2023-24 ఏడాదికి సంబంధించి గంగారం మండలంలోని 12 పంచాయతీల్లో వంద శాతం ఇంటి పన్నులు వసూలైంది.

కొత్తగూడ మండలంలోని 24 పంచాయతీల్లో 23 వంద శాతం చెల్లించాయి. కొత్తగూడలో అధికంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, గురుకులాలు ఉండడంతో వీటికి సబంధించిన పన్ను ఎవరూ చెల్లించక నూరుశాతానికి చేరుకోలేకపోయింది. ప్రజలు మాత్రం నూరుశాతం చెల్లించి ఆదర్శంగా నిలిచారు.

జిల్లాలో డోర్నకల్ మండలం వందశాతం టాక్స్ చెల్లించి మొదటి




స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో గంగారం, మూడోస్థానంలో తొర్రూరు, నాలుగో స్థానంలో కొత్తగూడ మండలాలు చోటు దక్కించుకున్నాయి. చివరగా పెద్దవంగర, కేసముద్రం మండలాలు ఉన్నాయి. మార్చిలోగా పన్ను వసూళ్లను పూర్తిచేయాల్సి ఉంది.

కార్యదర్శులు, సిబ్బంది కృషి

నూరుశాతం ఆస్తి పన్ను వసూళ్లకు ఏజెన్సీ మండలాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు కృషి చేశారు. జనవరి నుంచి లక్ష్యం పెట్టుకుని ఇల్లిల్లు తిరుగుతూ వసూలు చేశారు. ఉపాధి నిమిత్తం పట్టణ ప్రాంతాల్లో ఉండేవారికి కూడా సమాచారాన్ని అందించి చెల్లించేలా చర్యలు చేపట్టారు. దీంతో పలు పంచాయతీల్లో లక్ష్యం పూర్తైంది. నూరుశాతం పన్ను వసూళ్లపై ఆయా ఎంపీడీవోలు సైతం పంచాయతీ కార్యదర్శులను ప్రోత్సహిస్తుండడంతో వారి టార్గెట్‌లను పూర్తిచేశారు. వీరి శ్రమతోనే ఏజెన్సీ మండలాలు జిల్లాలో ఆదర్శంగా నిలిచాయి. ప్రజల సహకారంతోనే ఏజెన్సీలో అధిక శాతం పన్నుల వసూలు పూర్తి చేశామని కొత్తగూడ ఎంపీవో పద్మ పేర్కొన్నారు.

# రెండు పడక గదుల ఇళ్లకు రాజకీయ గ్రహణం



పెద్దపల్లి : రెండు పడకల గదుల ఇళ్లకు 'రాజకీయ' గ్రహణం ఏర్పడటంతో గత ప్రభుత్వ హయాంలో ఎంపికైన లబ్ధిదారులు ప్రయాస పడుతున్నారు. డబుల్ బెడ్ రూమ్‌ల మంజూరుపై గత ప్రభుత్వం లబ్ధిదారులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేసి పంపిణీలో తాత్సారం చేసింది. ఇంతలో ఎన్నికలు రావడం.. కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో వీటి పంపిణీపై మళ్లీ అనిశ్చితి నెలకొంది.

మొత్తం 3299 గృహాల కేటాయింపు

కాంగ్రెస్ ప్రభుత్వం వీటి పంపిణీ, అసంపూర్తి ఇళ్ల నిర్మాణంపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. జిల్లావ్యాప్తంగా మొత్తం 3,299 ఇళ్లు కేటాయించారు. గత ఏడాది జనవరి 23న మాజీ మంత్రి ఈశ్వర్ చేతుల మీదుగా మంథని పట్టణంలోని పోచమ్మవాడలో రూ.5.78 కోట్లతో 92 ఇళ్లలో 74 ఇళ్లను లబ్ధిదారులకు మాత్రమే పంపిణీ చేశారు. మిగిలిన 3,225 ఇళ్లలో 1,858 ఇళ్లు పూర్తయినప్పటికీ రహదారులు, కాలువలు, ఇతర మౌలిక వసతులు కల్పించలేదు. ఇంకా 1,367 ఇళ్లు అసలు నిర్మాణానికే నోచుకోకపోవడం గమనార్హం. మిగిలిన చోట్ల 13,683 దరఖాస్తులు రాగా నియోజకవర్గానికి 100 మంది చొప్పున లబ్ధిదారులను ఎంపిక మాత్రమే చేశారు. మౌలిక వసతులు లేకపోవడంతో ఎన్నికల అనంతరం పంపిణీ చేస్తామని అప్పటి ప్రజాప్రతినిధులు దాటవేశారు. పెద్దపల్లి, రామగుండం ప్రాంతాల్లో రిజర్వేషన్ల ప్రాతిపదికన లక్కీడ్రా ద్వారా ఎంపికైన వారికి టోకెన్లు ఇచ్చి చేతులుదులుపుకొన్నారు. కాల్వశ్రీరాంపూర్, మల్యాపూర్, కూచిరాజ్‌పల్లి వంటి చోట్ల ఇప్పటికీ నిర్మాణాలూ కొనసాగుతున్నాయి.

లబ్ధిదారుల ఎంపికపై ఫిర్యాదుల వెల్లువగత ప్రభుత్వ హయాంలో అధికారికంగా లక్కీడ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన సమయంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న ఇళ్ల సంఖ్య, ఎంపికైన లబ్ధిదారుల సంఖ్యకు చాలా తేడాలు వచ్చా యి. రామగుండం, పెద్దపల్లి, మంథని ప్రాంతాల్లో అప్పటి ప్రజాప్రతిని ధులు తమ కార్యకర్తలకే, అనర్హులకే ఇళ్లు కేటాయించారంటూ పలువురు ఇటీవలే ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశారు. సైతం ఇళ్ల కోసం దరఖాస్తు చేసి ఎంపిక కానివారు ఆందోళనలు వ్యక్తం చేశారు. గతంలో ఎంపికైన లబ్ధిదారుల జాబితాలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సర్వేలు చేసి వాస్తవ పరిస్థితులు పరిశీలించాకే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయాన్ని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో ప్రస్తావించింది. గతంలో ఎంపికైన లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

# బోగస్ కార్డుల ఏరివేత షురూ



హుజూరాబాద్ : ఉమ్మడి జిల్లాలో బోగస్ రేషన్ కార్డు ఏరివేత ప్రక్రియ షురూ అయ్యింది. చనిపోయిన వారు, స్థానికంగా నివాసముండని వారి కార్డులను రద్దు చేయడంతో పాటు వాటిలోని లబ్ధిదారుల పేర్లను తొలగించారు. ఏరివేత తర్వాత మిగిలిన రేషన్ కార్డుల్లోని లబ్ధిదారులకు అనుగుణంగా ఈ నెల బియ్యం కోటాను కేటాయించారు. దీంతో వేలాది క్వింటాళ్ల బియ్యం ప్రభుత్వానికి మిగులుబాటు అయ్యింది.

ఇదీ పరిస్థితి.. ఒక్కో వ్యక్తి పేరిట ఆరు కిలోల చొప్పున రేషన్ కార్డుల్లోని కుటుంబ సభ్యులందరికి బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. కొత్త కార్డులు జారీ చేయకపోవడం, ఏళ్ల తరబడి పాత వాటినే కొనసాగించడంతో స్థానికంగా లేనివారు, చనిపోయిన వారు, ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పేరిట కూడా ప్రతినెలా బియ్యం పంపిణీ అవుతోంది. దీనికితోడు ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలను వినియోగించుకుంటున్నారు. ఈ అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం బయోమెట్రిక్, ఐరిస్ విధానాన్ని అమలు చేసినప్పటికీ బోగస్ లబ్ధిదారులను గుర్తించడం కష్టంగా మారింది. దీనికి ప్రధాన కారణం రేషన్ కార్డుల్లోని ఎవరైనా సభ్యుడు ఒకరు డీలర్ వద్దకు వెళ్లి వేలిముద్ర వేస్తే సభ్యులందరికీ బియ్యం పంపిణీ చేసే వెసులుబాటును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాయి. దీన్ని ఆసరాగా చేసుకొని అనర్హులు సైతం బియ్యం తీసుకునే పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వాలు బోగస్ లబ్ధిదారులను గుర్తించి వారి పేర్లను తొలగించకపోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది క్వింటాళ్ల బియ్యం దుర్వినియోగం అవుతోంది. అనర్హులు రేషన్ కార్డులు కలిగి ఉండటంతో డీలర్ల వద్ద బియ్యం తీసుకుని నేరుగా ప్రయివేటు దళారులకు విక్రయిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 1,081 కార్డుల రద్దు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా పంపిణీ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసే దిశగా అడుగులు వేస్తోంది. ప్రభుత్వం బోగస్ కార్డుల ఏరివేతపై ప్రత్యేక దృష్టి సారించింది. బోగస్ కార్డుల వివరాలు ఇవ్వాలని గత నెలలో పౌరసరఫరాల సంస్థ ఆదేశించడంతో స్థానికంగా లేని వారు, చనిపోయిన వారి వివరాలతో కూడిన నివేదికను రేషన్ డీలర్లు అందజేశారు. దీని ఆధారంగా లబ్ధిదారులకు చెప్పకుండానే ఉమ్మడి జిల్లాలోని 1,081 రేషన్ కార్డులను రద్దు చేసింది. ఈ కార్డుల్లో సభ్యులుగా ఉన్న 4,364 మందికి బియ్యం కట్ చేసింది. తద్వారా 25.193 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి మిగులుబాటు అయ్యింది. ఉమ్మడి జిల్లాలో గత ఫిబ్రవరిలో 9,78,595 రేషన్‌కార్డులు ఉండగా, ఇందులోని 28,13,384 మంది సభ్యులకు 17,963.514 మెట్రిక్ టన్నుల బియ్యం కోటా కేటాయించింది. అదే ఈ నెలలో 9,77,514 రేషన్‌కార్డుల్లోని 28,09,020 మంది సభ్యులకు 17,938.321 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కేటాయించారు. అత్యధికంగా కరీంనగర్ జిల్లాలోనే 1,035 రేషన్‌కార్డులు రద్దయ్యాయి. జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల డీలర్లు ఇంకా బోగస్ లబ్ధిదారుల వివరాలను పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో ఏరివేత ప్రక్రియ ఇంకా మొదలుకాలేదు.

అప్పుడే కొత్తవి జారీ బోగస్ రేషన్ కార్డుల ఏరివేత ప్రక్రియ పూర్తయిన తర్వాతే కొత్త కార్డులను జారీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 2021 జూన్ వరకు 1,10,139 మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోగా అవి వివిధ దశల్లో ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా 1.40 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీటి ఆన్‌లైన్ ప్రక్రియ కూడా పూర్తయ్యింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతమున్న రేషన్ కార్డుల్లో ప్రతినెలా దాదాపు 15 శాతం మంది బియ్యం తీసుకోవడం లేదని, వీరిలో కొందరు ఒక నెల తీసుకుంటూ మరో నెల వదిలేస్తున్నారు.

# మళ్లీ ముప్పు తప్పదా?



వరంగల్ : నగరానికి వచ్చే వర్షాకాలంలో ముంపు ముప్పు తప్పేలా లేదు. గతేడాది జులై చివర్లో వరంగల్ పోతననగర్ వైపు భద్రకాళి చెరువు కట్టకు బుంగ పడటంతో ఓరుగల్లు నగరం గజగజ వణికింది. పోతననగర్, రంగంపేట, సరస్వతి కాలనీ, భద్రకాళి ఆలయం రోడ్డులో నివాసాలను ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు ఖాళీ చేయించారు. అదృష్టం కొద్దీ నీటి ప్రవాహం తక్కువగా ఉండటంతో గండం గట్టెక్కింది. ఆ సమయంలో చెరువు నీళ్లు బయటకు వెళ్లకుండా తాత్కాలిక చర్యలు చేపట్టారు. ఇంత వరకు పోతననగర్ వైపు భద్రకాళి చెరువు కట్ట వద్ద శాశ్వత పనులు చేపట్టలేదు. ఇప్పటికే లీకేజీతో నీళ్లు బయటకొస్తున్నాయి. గ్రేటర్ వరంగల్, ఇరిగేషన్ శాఖలు మేల్కొనక పోతే వచ్చే వర్షాకాలంలో ప్రమాదం పొంచి ఉన్నట్లే.

డౌన్ స్ట్రీమ్ షట్టర్లు ఎక్కడ..హంటర్ బొందివాగు నాలా వరదనీటిని భద్రకాళి చెరువులోకి మళ్లించడం, వరంగల్ పోతననగర్, హనుమకొండ కాపువాడ మత్తడిల వైపు డౌన్ స్ట్రీమ్ ప్వలింగ్ షట్టర్లు ఏర్పాటు చేసేందుకు ఇరిగేషన్ శాఖ ఇంజినీర్లు డిజైన్ చేశారు. సుమారు రూ.163 కోట్లతో పనులు ప్రతిపాదించారు. గత భారాస ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసింది. టెండర్ కూడా పూర్తయినట్లుగా తెలిసింది. ఇంత వరకు క్షేత్రస్థాయిలో పనులు మొదలుకాలేదు. తెలంగాణలో ప్రభుత్వం మారడంతో బొందివాగు నాలా ప్రాజెక్టు పనులపై సందేహాలు నెలకొన్నాయి. వరంగల్ పోతననగర్ భద్రకాళి చెరువు మత్తడి వద్ద వంపుగా ఉంటుంది. భద్రకాళి బండ్ అభివృద్ధి పనుల్లో భాగంగా పాత చెరువు కట్ట కూలింది. ఎనిమిది నెలలవుతున్నా చెరువు కట్ట బలోపేతం, డౌన్ స్ట్రీమ్ ప్వలింగ్ షట్టర్లు ఏర్పాటు చేయాలి. భారీ వర్షాలు పడితే వరదనీరు పోటెత్తే అవకాశాలున్నాయి.

ప్రమాదకరంగా వంతెనలు..

గతేడాది జులై నెలలో వరదలు వరంగల్ నగరాన్ని ముంచెత్తాయి. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో 200 కాలనీలు నీటమునిగాయి. వారం రోజుల పాటు జనజీవనం స్తంభించింది. రూ.కోట్ల నష్టం వాటిల్లింది. చాలాచోట్ల పాతకాలం నాటి వంతెనలు, కాజ్ వేలు కొట్టుకుపోయాయి. వీటిపై తక్షణం దృష్టి పెట్టాలి.

గతేడాది వరంగల్ రంగంపేట కూడలి భద్రకాళి దేవాలయానికెళ్లే ప్రధాన రోడ్డు వంతెన అయిదారు రోజుల పాటు నీటమునిగింది. వంతెనల చుట్టూ రెయిలింగ్ పూర్తిగా కొట్టుకుపోయింది. ఇంత వరకు కొత్తవి ఏర్పాటు చేయలేదు. రహదారి మునగకుండా వంతెన ఎత్తు పెంచాలని ప్రతిపాదించారు. ఇంత వరకు వీటి ఊసే లేదు.

హనుమకొండ బొక్కలగడ్డ, గోపాల్‌పూర్ పాత కాలం నాటి వంతెనలు వరదనీటికి దెబ్బతిన్నాయి. జవహర్‌నగర్, నయీంనగర్ వద్ద పాత వంతెనలకు పగుళ్లు వచ్చాయి. వీటి స్థానంలో కొత్తవి ప్రతిపాదించారు. ఇంత వరకు పనులు ప్రారంభించలేదు.

# ప్లాస్టిక్ ముప్పు.. ఎవరిదీ తప్పు?

భూపాలపల్లి : జిల్లా కేంద్రం భూపాలపల్లి పురపాలిక పరిధిలో రోజుకు 7 ట్రాక్టర్లు, 12 స్వచ్ఛ ఆటోల ద్వారా దాదాపుగా 14 టన్నుల వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. వీటిలో సింహభాగం ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. దీనికి తోడు పట్టణంలోని పలు కాలనీల్లోని మురుగు కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిళు ఇతరత్రా వ్యర్థాలు పేరుకుపోయి, మురుగు ముందుకు సాగకపోవడంతో ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పట్టణంలో ఏ వీధి చూసినా దుర్వాసన రావడం, దోమలు, పందుల స్వైర విహారంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

పట్టించుకోని అధికారులు..

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రోడ్డు మార్గంలోని హనుమాన్ టెంపుల్ సమీపంలో, సంతోషిమాత ఆలయం సమీపంలో, అంబేడ్కర్ కూడలి ప్రాంతంలోని సినిమా థియేటర్ వెనుక భాగంలో, కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్ దగ్గర, సంఘమిత్ర డిగ్రీ కళాశాల ఎదురుగా, శ్రీ చైతన్య పీజీ కళాశాల తదితర ప్రాంతాలతో పాటు శివారు ప్రాంతాల్లో ప్లాస్టిక్‌ను కుప్పలుగా పోసి నిప్పుపెడుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులు, పారిశుద్ధ్య సిబ్బంది అనునిత్యం కాలబెడుతున్నారు. పట్టణంలోని సీఆర్ నగర్ ప్రాంతంలోని డంపింగ్ యార్డులో నిత్యం ప్లాస్టిక్‌తో పాటు చెత్తాచెదారాన్ని కాలుస్తుండటం వల్ల సమీపంలోని అడవులకు ముప్పు ఏర్పడుతుంది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

జాడలేని తనిఖీలు..

ప్రస్తుత పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లు కావస్తున్నా ప్లాస్టిక్ నిర్మూలనలో విఫలమవుతోంది. అధికారులు సైతం నిషేధిత ప్లాస్టిక్‌ను వాడితే జరిమానాలు, సంబంధిత దుకాణాలను సీజ్ చేస్తామని చెబుతున్నారే తప్ప ఆచరణలో అమలు చేయకపోవడంతో దీని వినియోగం పెరిగిపోతోంది. పట్టణంలో ఏ దుకాణంలో చూసినా నిషేధిత ప్లాస్టిక్ కవర్లు కుప్పలు తెప్పలుగా విక్రయిస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది అడపాదడపా తనిఖీలు చేసి దుకాణ యజమానులపై చర్యలు క్రమంలో కొందరు పాలకులే అడ్డుపడుతున్నారు. 2022లో వివిధ దుకాణాలపై ఏడు కేసులు పెట్టగా పాలకవర్గ కౌన్సిలర్లు తనిఖీలు చేయవద్దని సిబ్బందిని బెదిరించి, సీజ్ చేసిన ప్లాస్టిక్‌ను మరలా అదే దుకాణదారులకే ఇచ్చేశారు. దీంతో పురపాలక సిబ్బంది ప్లాస్టిక్‌పై తనిఖీలు చేయాలనే విషయాన్నే పూర్తిగా మరిచిపోయారు. గడిచిన నాలుగేళ్లలో నాలుగైదు సార్లు మాత్రమే తనిఖీలు చేసినట్లు తెలిసింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు తగు చర్యలు తీసుకునేలా దృష్టి సారించాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

# అర్ధరాత్రి తోడేస్తున్నారు!

మహబూబాబాద్ : జిల్లాలో ఇసుక అక్రమానికి అడ్డుకట్ట వేసేందుకు రెవెన్యూ, పోలీసు యంత్రాంగం పలు ప్రయత్నాలు చేస్తున్నా అడ్డుకట్ట వేయలేకపోతోంది. ఒకప్పుడు పగటిపూట తవ్వించినవారు ప్రస్తుతం అర్ధరాత్రి వాగుల నుంచి ఇసుక రవాణా చేస్తున్నారు. దీంతో వాగుల్లో భూగర్భజలాలు అడుగంటాయి. పరివావాక ప్రాంతాల్లోని పొట్టదశలో ఉన్న పంటలు ఎండిపోతున్నాయి. తవ్వకాలు ఇలానే కొనసాగితే రాబోయే రోజుల్లో తాగునీటికి ప్రజలు అల్లాడే పరిస్థితులు నెలకొన్నాయి.

తెల్లవారుజాము వరకు

కొన్ని చోట్ల రాత్రి 9 నుంచి, ఇంకొన్ని చోట్ల అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు తవ్వకాలు కొనసాగుతున్నాయి. ఈ సమయంలో అధికారులు పట్టుకోరనేది అక్రమార్కుల ఆలోచన. ఒకప్పుడు 300 ట్రాక్టర్లలో ఇసుక రవాణా జరిగేది. నిఘా పెరగడంతో జిల్లాలో సుమారు 60 ట్రాక్టర్ల ద్వారా రవాణా అవుతోంది. ఒక్కో ట్రాక్టరులో 3 క్యూబిక్ మీటర్ల ఇసుక పడుతుంది. ఈ లెక్కన 60 ట్రాక్టర్ల ద్వారా 180 క్యూబిక్ మీటర్ల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు.

సిబ్బంది చేతివాటం

పోలీసు అధికారులు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసులు నమోదు చేస్తుంటే కింది స్థాయి సిబ్బంది మాత్రం 'మామూలు'గా తీసుకుంటున్నారు. ఇసుక ట్రాక్టర్లను ఆపి ఉన్నతాధికారి లేనప్పుడు సిబ్బంది డబ్బు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఇవ్వని వారిని ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

నర్సింహులపేట మండలం కొమ్ములవంచ సమీపంలోని ఆకేరు వాగు నుంచి రాత్రి వేళలో ఇసుక అక్రమ రవాణా అవుతోంది. జయపురం, కౌసల్యదేవిపల్లి, రామన్నగూడెం పరిధిలో ప్రవహిస్తోంది. రోజూ 20 ట్రాక్టర్లు అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామువరకు రవాణా కొనసాగిస్తున్నాయి.

రాజకీయ నాయకుల ఒత్తిడి

ప్రస్తుతం అనుమతులు లేకుండా రాత్రి సమయంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేయకముందే వాటిని స్టేషన్ నుంచి బయటకు పంపిస్తున్నారు. ఇందుకు రాజకీయ నాయకుల ఫోన్ల ఒత్తిడి కారణమని తెలుస్తోంది.

అధిక ధరలకు విక్రయం

గతంలో ఒక్కో ట్రిప్పు ఇసుకను రూ.3 వేల నుంచి రూ.3,500 వరకు విక్రయించేవారు. ఇప్పుడు అధికారులు అడ్డుకుంటున్నారనే సాకుతో ఆకేరు వాగులోని ఒక ట్రిప్పునకు రూ.7 వేల వరకు తీసుకుంటున్నారు. మిగిలిన చోట్ల రూ. 5 వేల వరకు విక్రయిస్తున్నారు.

ఈ ప్రాంతాల నుంచే అధికంగా..

నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి, ఎర్రబెల్లిగూడెం, బ్రాహ్మణకొత్తపల్లి, నెల్లికుదురు, మునిగలవీడు గ్రామాల శివారులోని ఆకేరు వాగు నుంచి అర్ధరాత్రి రవాణా కొనసాగుతోంది. రోజుకు పది ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారు.

గూడూరు మండలం కొల్లాపురం శివారులోని మున్నేరు వాగును కూడా వదలిపెట్టడం లేదు. తవ్వకాలతో రాళ్లు తేలుతున్నాయి. నీరు నిల్వ ఉండడం లేదని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దంతాలపల్లి మండలం వేములపల్లి, దోనకొండ గ్రామాల సమీపంలో పాలేరు వాగు ఉంది. కొద్ది రోజుల నుంచి తవ్వకాలు జోరందుకున్నాయి. రోజుకు పది ట్రాక్టర్ల ద్వారా అర్ధరాత్రి మండల కేంద్రానికి, ఇతర గ్రామాలకు తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టరు ఇసుకను రూ.4500 చొప్పున అమ్ముతున్నారు.

బయ్యారం మండలం కాచనపల్లి సమీపంలోని పెద్దవాగు వద్ద చీకటి పడగానే ట్రాక్టర్లు రోడెక్కుతున్నాయి. ప్రతి రోజు 15 ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నర్సింహులపేట ఎస్సై గండ్రాతి సతీష్ పేర్కొన్నారు. ఆకేరు వాగులో ఇసుక తరలించకుండా ట్రెంచ్‌లు కొట్టామన్నారు. వాటిని పూడ్చి ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

# సమస్యల భాండాగారాలు

మెట్‌పల్లి : విజ్ఞాన భాండాగారాలుగా పేర్గాంచే గ్రంథాలయాలు అసౌకర్యాలతో కొట్టుమిట్టాడుతున్నాయి. వరుస ఉద్యోగ ప్రకటనలతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు బాసట ఇవ్వలేకపోతున్నాయి. జిల్లాలో మండలానికో గ్రంథాలయం ఉన్నప్పటికీ సొంత భవనాలు, కనీస వసతులు కరవయ్యాయి. గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాల్లో వసూలు చేసే ఆస్తి పన్నులో సెస్సు రూపేణా వసూలు చేస్తున్నా అవసరమైన సౌకర్యాలు కల్పించడం లేదు. కొన్ని చోట్ల సిబ్బంది సమయపాలన కరవైంది. జిల్లాలో గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలపై పరిశీలన కథనం..

సొంత భవనం కరవు

రాయికల్ పట్టణంలో గ్రంథాలయానికి సొంత భవనం లేక 36 ఏళ్లుగా అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య నడుస్తోంది. కనీస వసతులు లేక గ్రంథాలయానికి వెళ్లడానికి పాఠకులు ఆసక్తి చూపడం లేదు. నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు కరవయ్యాయి. ప్రస్తుతం ఒప్పంద ఉద్యోగి విధులు నిర్వర్తిస్తున్నారు. సుమారు 13వేల పుస్తకాలు అందుబాటులో ఉండగా, వాటిలో కాలం చెల్లినవే అధికంగా ఉన్నాయి. పుస్తకాలు భద్రపర్చేందుకు బీరువాలు లేక దుమ్ము, ధూళి పేరుకుపోతున్నాయి.

పాఠకులు కోరితేనే పుస్తకాలు

మల్యాలలో పదేళ్ల కిందట నిర్మించిన గ్రంథాలయ భవనం పాఠకులకు అందుబాటులో ఉన్నప్పటికీ సద్వినియోగం చేసుకోవడంలేదు. నిత్యం పది నుంచి ఇరవై మంది పాఠకులు వస్తుంటారని గ్రంథపాలకుడు కృష్ణ తెలిపారు. పోటీ పరీక్షల పుస్తకాల గురించి తమను సంప్రదిస్తే 'ఆన్ డిమాండ్ రిజిస్టర్‌'లో నమోదు చేసి ఉన్నతాధికారులకు పంపించి తెప్పిస్తామని వివరించారు. ప్రస్తుతానికి 'టెట్, గ్రూప్-1, 2, 3 పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలు, ఎనిమిది రకాల దినపత్రికలు అందుబాటులో ఉన్నట్లు గ్రంథపాలకుడు తెలిపారు.

సమయపాలన ఏదీ?

మల్లాపూర్‌లో 12 ఏళ్ల కిందట నిర్మించిన భవనంలో గ్రంథాలయం అరకొర వసతుల నడుమ నిర్వహిస్తున్నారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో లేవు. కొంతకాలంగా విద్యుత్తు సరఫరా లేక పంకాలు, దీపాలు వెలగడం లేదు. మూత్రశాలలు లేకపోవడంతో పాఠకులు ఇబ్బంది పడుతున్నారు. కంప్యూటర్లు, అంతర్జాల సౌకర్యం లేక అవస్థలు తప్పడం లేదు. గ్రంథాలయంలో 7,639 పుస్తకాలు ఉన్నప్పటికీ గ్రంథపాలకుడు రాకపోవడంతో చదువుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది. గ్రంథాలయానికి నిత్యం 30 నుంచి 40 మంది వస్తున్నప్పటికీ బయట ఉన్న దినపత్రికలు మాత్రమే చదివి వెళ్లాల్సి వస్తోంది.

సమకూరని అదనపు గదులు

గ్రంథాలయంలో పాఠకులు సౌకర్యాల లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇన్‌ఛార్జి గ్రంథపాలకుడు కేవలం బుధవారం మాత్రమే అందుబాటులో ఉండడంతో మిగతా ఆరు రోజులు పాఠకులు దినపత్రికలే చదవాల్సి వచ్చేది. ప్రభుత్వం గ్రంథాలయానికి రికార్డు సహాయకుడు పోస్టును భర్తీ చేసి, అతడికే గ్రంథపాలకుడిగా సోమవారం నుంచి బాధ్యతలు అప్పగించడంతో నిరుద్యోగులు, పాఠకులకు నిత్యం



పుస్తకాలు అందుబాటులో ఉండనున్నాయి. గ్రంథాలయంలో నిత్యం సుమారు 40 మంది వరకు పాఠకులు వస్తుంటారు. మూత్రశాలలు లేకపోవడంతో నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు. రూ.9 లక్షలతో అదనపు గదుల నిర్మాణానికి 2019లో శంకుస్థాపన చేయగా పనులు ప్రారంభం కాలేదు.

మూత్రశాలలు లేవు..

మెట్‌పల్లి పట్టణంలో గ్రంథాలయం భవన నిర్మాణం పూర్తి కాక పాత మండల పరిషత్ కార్యాలయంలోని ఓ గదిలో సర్దుకుపోవాల్సి వస్తోంది. నిత్యం 60 నుంచి 80 మంది పాఠకులు వరకు వస్తుండగా, గదిలోనే పుస్తకాలు నిల్వ ఉండడం, చదువుకోవాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగ ప్రకటనలతో ఇక్కడికి దూరప్రాంతాల నుంచి పోటీ పరీక్షల నిమిత్తం నిరుద్యోగులు వస్తుండగా, మూత్రశాలలు, సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. కంప్యూటర్లు ఉన్నప్పటికీ ఇరుకు గదిలో వీలులేక పక్కన పెట్టేశారు. కుర్చీలు, ఇతర పుస్తకాలు కూడా పూర్తిస్థాయిలో ఉంచేందుకు వీలుకాక మరో గదిలో నిల్వ చేశారు. గ్రంథపాలకుడికి అదనంగా మరో రెండు మండలాల బాధ్యతలు ఉండడంతో వారంలో మూడు రోజులు మాత్రమే వస్తున్నారు.

పూర్తి కాకముందే ప్రారంభం

కోరుట్ల పట్టణంలో గ్రంథాలయ నూతన భవనం అసంపూర్తిగా ఉంది. టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.60 లక్షలతో మూడేళ్ల కిందట నిర్మాణ పనులు చేపట్టి భవనం పూర్తయ్యిందంటూ శాసనసభ ఎన్నికలకు ముందు ప్రారంభించారు. తాగునీరు, మూత్రశాలలు, విద్యుత్తు సౌకర్యం, అంతర్జాలం, ప్రహరీ పూర్తి కాలేదు. ప్రస్తుతం జూనియర్ కళాశాల మైదానంలో గ్రంథాలయం కొనసాగిస్తుండగా, కంప్యూటర్, అంతర్జాలం, తాగునీరు, మరుగుదొడ్లు, కుర్చీలు కరవయ్యాయి. దినపత్రికలు చదువుకోవడానికి ఎక్కువ మంది పాఠకులు వస్తుండగా, పోటీ పరీక్షలకు సిద్ధపడే నిరుద్యోగులు పది మంది వస్తున్నారు. అకాడమీ, ఇతర పాఠ్య పుస్తకాలు పూర్తి స్థాయిలో ఉంచేందుకు గదులు లేకపోవడంతో ఇండోర్ స్టేడియంలో మూలకు పడేశారు. నూతన భవనంలో పూర్తిస్థాయి వసతులు కల్పించేందుకు రూ.30 లక్షలు నిధులు అవసరమున్నట్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

కానరాని వసతులు

ధర్మపురి శాఖా గ్రంథాలయంలో అసౌకర్యాలు నెలకొన్నాయి. సుమారు 60 మంది వరకు యువత, విద్యార్థులు వస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. గతంలో కంటే పరిస్థితులు మెరుగైనా పోటీ పరీక్షలకు కొత్త పుస్తకాలు లేవు. నూతనంగా అధికారులు ప్రతిపాదనలు పంపినా అమలుకు నోచుకోలేదు. అంతర్జాల సదుపాయం లేదు. సొంత భవనం ఉన్నా కనీస వసతులు లేవు. ఇన్‌ఛార్జి గ్రంథపాలకుడు పనిచేస్తున్నారు. తాగునీటి సమస్య నెలకొంది.

# ధూమపానం.. యమపాశం!



కరీంనగర్ : 'కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌కు చెందిన 60 ఏళ్ల రైతుకు 20 ఏళ్లుగా ధూమపాన వ్యసనానికి గురయ్యారు. ఊపిరితిత్తుల సమస్యతో తీవ్రంగా బాధపడుతూ వైద్యులను ఆశ్రయించారు. బాధితుడిని కుటుంబ సభ్యుల సమక్షంలో కూర్చోబెట్టి ధూమపానం మానేయాలని, మందులు వాడితే పరిస్థితి మెరుగుపడుతుందని వైద్యులు సూచించారు. దీంతో వ్యసనానికి దూరంగా ఉండటంతోపాటు మందులు వాడటంతో సాధారణ స్థితికి చేరుకొని ప్రస్తుతం మెరుగైన జీవితాన్ని గడుపుతున్నారు.'

"గోదావరిఖనికి చెందిన విశ్రాంత సింగరేణి ఉద్యోగి 30 ఏళ్లుగా ధూమపానం అలవాటు ఉండటంతో సీవోపీడీ (క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీస్)తో బాధపడుతున్నారు. వైద్యులను సంప్రదించి మందులు వాడుతున్నప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోవడంతో వైద్యులు ప్రాణానికే ముప్పు అని తేల్చారు. దీంతో సంవత్సర కాలంగా సిగరెట్ల సంఖ్య తగ్గిస్తూ మందులు వాడుతున్నారు. ప్రస్తుతం దగ్గు, ఆయాసం వంటి లక్షణాలు తగ్గినట్లు పేర్కొన్నారు."

ధూమపానం వల్ల ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని తెలిసినప్పటికీ దాని బారిన పడిన వారు అలవాటును మానడం లేదు. ఫలితంగా ఊపిరితిత్తులు తదితర సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇలాంటి వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి ధూమపానం వదిలేస్తే సమస్యను అధిగమించే అవకాశముంది కానీ.. ఇప్పటికీ 15 ఏళ్ల పైబడిన వారు మొదలుకొని వయోవృద్ధుల వరకూ ధూమపానం వ్యసనం పాలవడం ఆందోళన కలిగిస్తోంది.

సర్వేలు ఏం చెబుతున్నాయంటే..

2001- 03 సంవత్సరం సర్వే ప్రకారం 35 శాతం మంది ధూమపానం బారిన పడినట్లు లెక్కలు చెబుతున్నాయి. 2019 నుంచి 2023 వరకు జరిగిన సర్వేల్లో 25 శాతానికి పైగా తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తోంది. తెలంగాణలో 8.3 శాతం ధూమపానం చేసేవారు ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ జాతీయ వైద్య, ఆరోగ్యశాఖ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో తేలింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10 శాతంపైగా ధూమపానం అలవాటున్నవారు ఉన్నట్లు ఒక అంచనా. వీరిలో చాలా మంది బీడీ కార్మికులున్నారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో బీడీల ఉత్పత్తి ఎక్కువగా ఉండటం వల్ల బీడీల వినియోగం కూడా ఎక్కువగా ఉంది. కొవిడ్ అనంతరం ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో ధూమపానం అలవాటుకు దూరం అవుతున్నవారి సంఖ్య ఎక్కువగానే ఉంటుందని ఛాతివైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

ఇవీ ఇబ్బందులు

పదేళ్లకు పైబడి నిత్యం 10కి పైగా సిగరెట్లు లేదా బీడీలు తాగేవారిలో ఊపిరితిత్తులకు సంబంధించి సీవోపీడీ వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు.

దగ్గు, దమ్ము, జ్వరం, ఆకలి తగ్గడం, నీరసంగా ఉండి ఎక్కువ పని చేయలేకపోవడం, మెట్లు ఎక్కలేకపోవడం, ఆయాసంతో బాధపడుతుంటారు.

ఇలాంటి బాధితులను వైద్య పరీక్షలతో నిర్ధారించిన తరువాత దెబ్బతిన్న ఊపిరితిత్తులను మామూలు స్థాయికి తీసుకు రాలేకపోయినప్పటికీ మందుల ద్వారా తీవ్రత పెరగకుండా కాపాడవచ్చు. మందులు వాడే వారు ధూమపానాన్ని పూర్తిగా వదిలేయాలి. వైద్యులు సూచించినన్ని రోజులు మందులు వినియోగించాలి.

ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువ. 20 ఏళ్ల పైబడి నిరంతర ధూమపానం చేసే వారిలో ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు.

ధూమపానం వల్ల ఛాతిలో నొప్పి ఎక్కువగా రావడం, జ్వరం, ఊపిరితిత్తుల లోపల గడ్డలు తయారవుతాయి. దగ్గితే రక్తం కూడా పడుతుంది. ఈ వ్యాధి మూడు, నాలుగు దశల్లోకి చేరిన తరువాతనే చాలా మంది వ్యాధిగ్రస్తులు వైద్యులను సంప్రదిస్తున్నారు. శస్త్రచికిత్స, కీమోథెరపీ అందుబాటులో ఉన్నప్పటికీ సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. మొదటి, రెండు దశల్లో గుర్తిస్తే ప్రమాదం నుంచి బయటపడవచ్చని నిపుణులు చెబుతున్నారు.

మానేస్తే మంచిది

ధూమపానం చేసే వారు మా వద్దకు వచ్చినప్పుడు మాన్పేయాలని కౌన్సెలింగ్ ఇస్తున్నాం. ప్రత్యేకంగా ఇందుకోసం కౌన్సెలింగ్ కేంద్రాలు లేవు. మానిపించేందుకు నికోటిన్ మాత్రలు ఉన్నప్పటికి అవి కొన్ని సందర్భాల్లో ఉపయోగపడకపోవచ్చు. ధూమపానం బాధితులకు బతకాలన్న తపన.. అలవాటును మానేయాలనే పట్టుదల ఉండాలి. గతంతో పోలిస్తే కొవిడ్ అనంతరం వ్యసనానికి గురవుతున్న వారి సంఖ్య తగ్గుతుండడం శుభ పరిణామం.డాక్టర్ వి.చంద్రశేఖర్, సీనియర్ ఛాతి వైద్య నిపుణుడు, కరీంనగర్

# కొరవడిన రక్షణ.. ఆలయ భూముల ఆక్రమణ



సిరిసిల్ల : సిరిసిల్లలో శ్రీశాల వేంకటేశ్వరస్వామి, శ్రీవిశ్వనాథస్వామి పురాతన ఆలయాలు ఉన్నాయి. ఈ రెండింటికీ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో రూ.కోట్ల విలువ చేసే భూములున్నాయి. వాటికి రక్షణ లేక ఆక్రమణల చెరలో చిక్కుతున్నాయి. దేవాదాయశాఖ అధికారులు వీటి హద్దుల ఏర్పాటుకు ఏళ్ల తరబడి జాప్యం చేస్తూనే ఉన్నారు. ఇప్పటికే కబ్జాకు గురైన వేంకటేశ్వరస్వామి ఆలయ భూములను రాబట్టుకోలేక నానా తంటాలు పడుతున్నారు. తాజాగా శ్రీవిశ్వనాథస్వామి ఆలయ భూముల వివాదం ఒకటి ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది.సిరిసిల్ల పురపాలక సంఘం కార్యాలయం పక్కనున్న శ్రీవిశ్వనాథస్వామి ఆలయానికి పట్టణంలో వివిధ ప్రాంతాల్లో 2.09 ఎకరాల భూమి ఉంది. దీనిలో శాంతినగర్‌లో 0.22 ఎకరాలు ఉంది. దీని పక్కనే ప్రభుత్వ భూమి 0.10 ఎకరాలు ఉంది. దీనిలో నుంచి రహదారి వెళ్లింది. ఇక్కడి స్థలంపై కబ్జాదారుల కన్ను పడింది. దీనిలో ఇప్పటికే కొంత భూమి ఆక్రమణకు గురైనట్లు కలెక్టరుకు ఫిర్యాదులు వెళ్లాయి. దేవాదాయశాఖ సర్వే చేయించకపోవడంతో ఎంత మేరకు ఆక్రమణ జరిగిందనే విషయం వెలుగులోకి రావడం లేదు. ప్రస్తుతం మరికొంత కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఖాళీగా ఉన్న స్థలంలో చాలా ఏళ్లుగా నిర్మాణాలు వెలువడం అధికారుల పర్యవేక్షణ లోపానికి అద్దం పడుతోంది. ఇక్కడే కొంత స్థలాన్ని ఒక సామిల్లుకు అద్దెకిచ్చారు. దాని ద్వారా ఆలయానికి నెలకు రూ. 12 వేలు వస్తోంది. అయితే ఈ స్థలం చుట్టూ ఎలాంటి హద్దులు లేకపోవడం, చుట్టు పక్కల ఆక్రమణలకు ఆస్కారం ఏర్పడింది. నిర్మాణాలు జరిగిన ప్రతిసారి ఆలయ స్థలంపై పట్టణ ప్రజల దృష్టి కేంద్రీకృతమవుతోంది. ఇదిలా ఉంటే పురపాలక శాఖ కార్యాలయం పక్కనే ఉన్న ఈ ఆలయ భూమి ఇప్పటికే చుట్టుపక్కల కబ్జాకు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇది చాలా రోజులుగా విచారణకే పరిమితమైంది.

డిమాండ్ పెరుగుతుండటంతో...జిల్లా కేంద్రంగా ఏర్పడటం, పట్టణం నలుమూలల విస్తరిస్తుండటంతో నివేశన స్థలాలకు డిమాండ్ పెరుగుతోంది. ప్రస్తుతం శ్రీవిశ్వనాథస్వామి ఆలయ భూమి ఉన్న ప్రాంతంలో గజం రూ.30 వేల పైనే ధర పలుకుతుంది. ఒకప్పుడు ఖాళీగా ఉన్న ప్రాంతం చుట్టూ ఇంటి నిర్మాణాలు విస్తరించాయి. దీనికి హద్దులు లేకపోవడంతో ఏ పక్క నుంచి ఎవరు ఆక్రమించుకుంటున్నారనేది తెలియని పరిస్థితి ఉంది. ఆలయానికి సంబంధించిన భూములను కాపాడాల్సిన స్థానికులే ఆక్రమణలకు ప్రయత్నిస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

ఒక్క అడుగు పరాధీనం కానీయంఇటీవల కాలంలో ఈ స్థలం ఆక్రమణ జరుగుతున్నట్లు మాకు ఫిర్యాదులు వస్తున్నాయి. అక్కడున్న భూమి చుట్టూ హద్దులు లేకపోవడంతో ఈ సమస్య ఏర్పడుతుంది. ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు దేవాదాయశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. దీని పక్కనే ప్రభుత్వ భూమి కూడా ఉంది. ఈ రెండింటికి కలిపి రెవెన్యూ సర్వేయరు కొలిచి హద్దులు నిర్ణయించాలి. శ్రీవిశ్వనాథస్వామి ఆలయానికి సంబంధించి ఒక్క అడుగు కూడా పరాధీన కానీయమం.మారుతీరావు, ఆలయ ఈవో

# ప్రభుత్వ నిధులు ప్రైవేటు పరం..!

జనగామ : లింగాలఘనపురం మండలంలోని ఆర్టీసీ కాలనీ సమీపంలో ఓ ప్రైవేటు వేడుకల మందిరం వరకు ప్రభుత్వ నిధులతో రోడ్డు నిర్మించారు. ఆర్టీసీ కాలనీ వద్ద జనగామకు చెందిన కొందరు రెండు వేడుకల మందిరాలు నిర్మించారు. సూర్యాపేట-జనగామ జాతీయ రహదారి నుంచి ఈ వేడుకల మందిరాల వరకు సుమారు 400 మీటర్ల మేర సీసీ రోడ్డును ఇటీవల నిర్మించారు. ఈ రోడ్డుకు జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.40 లక్షలు వినియోగించినట్లు సమాచారం. విషయంపై మాజీ సర్పంచి స్వరూపారాణిని వివరణ కోరగా పై అధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ ఏకగ్రీవంగా తీర్మానించిందని తెలిపారు. అప్పటి కలెక్టర్ ప్రొసీడింగ్ మేరకు ఎస్టిమేట్ వేసినట్లు ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ నిధులు ప్రైవేటు పరం కావడం ఏంటని, అధికారులు విచారణ జరిపించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# పేదల కల నెరవేరేనా!

మెట్‌పల్లి : సింగరేణి స్థలాలను క్రమబద్ధీకరించి తమకు పట్టాలు ఇస్తారని ఏడు సంవత్సరాలుగా దాదాపు 186 మంది ఎదురుచూస్తున్నారు. సంస్థ విస్తరించి ఉన్న ఉమ్మడి ఆరు జిల్లాల్లో 19,124 మంది ప్రజలు సంస్థ స్థలాల్లో నివాస గృహాలు నిర్మించుకొని ప్రభుత్వం నుంచి పట్టాలు అందుకోగా అలాంటి భాగ్యం తమకెప్పుడు దక్కుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... రామగుండం నగరపాలక సంస్థ 15వ డివిజన్‌లోని తారకరామానగర్, భాస్కర్‌రావు నగర్ ఏరియాలో దాదాపు పాతిక సంవత్సరాల నుంచి 186 కుటుంబాల వారు సింగరేణి స్థలంలో రేకుల షెడ్లు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. వీరిలో కొంతమంది సింగరేణి సంస్థలో పనిచేసి ఉద్యోగవిరమణ పొందిన వారు ఉండగా మరికొందరు సంస్థలో కాంట్రాక్టు కార్మికులుగా ఇతర కూలీ పనులు చేసుకొని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారే ఉన్నారు. కాగా సింగరేణి స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నవారికి పట్టాలు ఇవ్వాలంటూ దాదాపు ఆరు సంవత్సరాల క్రితం రెవెన్యూ శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ఫలితంగా సంస్థ విస్తరించి ఉన్న మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి, మందమర్రి, నస్పూర్, భద్రాద్రి కొత్తగూడెం ప్రాంతాల్లో నిర్దేశించిన స్థలాలను సింగరేణి యాజమాన్యం ప్రభుత్వానికి బదలాయించింది. రామగుండం నియోజకవర్గంలో మల్కాపూర్, కేకే నగర్, ఇందిరానగర్, లక్ష్మీనగర్, హనుమాన్‌నగర్, సంతోష్‌నగర్ ప్రాంతాల్లోని 923.93 ఎకరాల స్థలంలో కొంతభూమినే ఆర్జీ-2 యాజమాన్యం ప్రభుత్వానికి అప్పగించింది సింగరేణి క్వార్టర్ల మధ్యలో తారకరామానగర్, భాస్కర్‌రావునగర్



ప్రాంతాలకు చెందిన స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించలేదు. కాగా ఈ ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు ఇవ్వాలంటూ స్థానికులు పలుమార్లు సింగరేణి యాజమాన్యానికి, స్థానిక ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సమస్యపై గత ప్రభుత్వ హయాంలో నాటి ఎమ్మెల్యే సైతం అసెంబ్లీలో ప్రస్తావించారు. నేటికీ సమస్య పరిష్కారం కాలేదని.. ఇప్పటికైనా పరిశీలించి తమకు పట్టాలు ఇప్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పదేళ్లుగా పన్నులు కడుతున్నాం

-బి.దామోదర్, స్థానికుడు

పాతికేళ్లక్రితం ఈ ప్రాంతంలో ఇంటిని నిర్మించుకున్నాం. ప్రభుత్వానికి పదేళ్లుగా ఇంటిపన్ను, నల్లా పన్ను కడుతున్నాం. పట్టా ఇవ్వకపోవడం వల్ల పలు సమస్యలు ఎదురవుతున్నాయి. పట్టాలు ఇవ్వాలంటూ పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నాం. అయినా ప్రయోజనం లేదు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమైనా మా ఇబ్బందులను గుర్తించి పట్టాలు ఇవ్వాలి.

# కన్నీళ్లే ఉబికి వస్తున్నాయ్!

మహబూబాబాద్ : తీవ్ర వర్షాభావ పరిస్థితులు.. అడుగంటిన భూగర్భ జలాలు.. ఎండుతున్న పంటలు.. చేతికి వచ్చిన చేను నిలువునా నెర్రెలు బాయడంతో అన్నదాతలు కాపాడుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు.. కొత్తగా బోర్లు వేస్తే నీళ్లు వస్తాయన్న ఆశతో రూ.లక్షల్లో వెచ్చిస్తున్నారు.. నీళ్లు పడక.. పంట దక్కక అప్పుల పాలవుతున్నారు. పాతాళ గంగను పైకి తీసుకురావాలని భగీరథ ప్రయత్నం చేస్తూ.. నాలుగైదు బోర్లు వేస్తున్నా.. చుక్క నీరు పడటం లేదు.

20 శాతమే ఫలితం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9.61 లక్షల ఎకరాల్లో యాసంగి పంటలు సాగవుతుయి. భూగర్భ జలాలు పడిపోవడంతో రైతులు కొత్తగా బోర్ల తవ్వకంపై దృష్టిసారించారు. ఒక్కో రైతు కనీసం ఐదు వరకు వేస్తున్నారు. 350 నుంచి 900 అడుగుల లోతు వరకు తవ్విస్తున్నారు. 100 బోర్లు వేస్తే అందులో 20 శాతమే సక్సెస్ అవుతున్నాయని బోరు యంత్రాల నిర్వాహకులు చెబుతున్నారు.

5 బోర్లు.. రూ.1.60 లక్షల ఖర్చు భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెంకట్రావుపల్లికి చెందిన కనుమరుగుల సదయ్య పొలంలో బోరు వేస్తున్న దృశ్యమిది.. యాసంగిలో 8 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. రూ.1.20 లక్షల పెట్టుబడి అయింది. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో ఇప్పటివరకు 5 బోర్లు వేసినా చుక్కనీరు రాలేదు.



రూ.1.60 లక్షల ఖర్చు చేశారు. అప్పే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు.

చుక్క నీరు రాలే..బోరు వేసిన చోటును చూపిస్తున్న ఈ రైతు జనగామ జిల్లా లింగాలఘనపురం గ్రామానికి చెందిన జాగిల్లపురం అబ్బులు... మూడు బోరుబావుల కింద 2 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఇటీవల బోర్లలో నీరు తగ్గి పొలం ఎండిపోతుండటంతో రూ.50 వేలు వెచ్చించి 2 బోర్లు వేయిస్తే చుక్క నీరు రాలేదు. ఎకరన్నర వరి పంటను రూ.9 వేలకు గొర్రెల మేతకు విక్రయించారు. సుమారు 1.80 లక్షల నష్టం వాటిల్లిందని వాపోయారు.

రూ.3.50 లక్షలు ఖర్చు..

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం చింతబావితండాకు చెందిన ఆంగోతు సత్తమ్మ రెండెకరాల్లో వరి సాగుచేశారు. పంట చేతికొస్తుందన్న సమయంలో నీరందక పొలం ఎండింది. దీంతో ఒకే రోజు నాలుగు బోరు బావులను తవ్వించారు. 300 అడుగులు వేసినా చుక్క నీరు రాలేదు. పెట్టుబడులు, బోర్ల తవ్వకానికి రూ.3.50 లక్షల వరకు అప్పుయిందని సత్తమ్మ విచారం వ్యక్తం చేశారు.

ఎనిమిది బోర్లు వేయించినా..

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం చింతబావితండాకు చెందిన కునుసోతు శ్రీను రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. నీటిఎద్దడి తలెత్తడంతో మూడు రోజుల వ్యవధిలో ఎనిమిది బోరుబావులను తవ్విస్తే చుక్క నీరు రాలేదు. సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

బోరు డ్రిల్లింగ్‌కు ఖర్చు ఇలా..

డ్రిల్లింగ్ చేసినందుకు(ఫీట్) : రూ.90 కేసింగ్‌కు(ఫీట్) : రూ.300(ఆరున్నర ఇంచులు), రూ.400(ఎనిమిది ఇంచులు)

# సమీకృతం.. తూతూమంత్రం..!

వికారాబాద్ : ప్రజలకు తాజా కూరగాయలు, పండ్లు, మాంసం అందించేందుకు ఉద్దేశించిన సమీకృత మార్కెట్ల నిర్మాణాల్లో నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. కోట్లాది రూపాయల వ్యయంతో 2018లోనే పనులు ప్రారంభించినా పర్యవేక్షణ అధికారులు కొరవడ్డారు. దీంతో పునాదుల్లోనే బీటలు వారుతున్నాయి. ప్రజా ధనం వృథా అవుతోంది.నెరవేరని సంకల్పం..

జిల్లాలోని పరిగి, కొడంగల్, వికారాబాద్, తాండూరు మున్సిపాలిటీల్లో సమీకృత మార్కెట్ల ఏర్పాటుతో పేదలకు అండగా నిలవాలన్న సంకల్పం నెరవేరడం లేదు. అన్నిచోట్ల పనులు మొక్కుబడిగా సాగుతున్నాయి. వికారాబాద్‌లో రూ.7.20కోట్ల అంచనాతో చేపట్టారు. 108 దుకాణాలు ఏర్పాటు చేసి పేదలకు ఇవ్వాలని నిర్ణయించారు. కానీ పనులు మాత్రం పునాదులు దాటడం లేదు.

ఇటీవల కొడంగల్‌లో జరుగుతున్న పనులను పరిశీలించిన పురపాలక పరిపాలన కార్యాలయ రాష్ట్ర సంచాలకురాలు హరిచందన నాణ్యత లేదని పనులు నిలిపివేయాలని ఆదేశించారు. దీంతో గుత్తేదారు మారు మాట్లాడకుండా విరమించుకున్నారు.

పరిగిలో ఏర్పాటు చేస్తున్న భవన పునాదికి పగుళ్లు ఏర్పడ్డాయి. చూసిన వారంతా ఇవేం పనులని విమర్శించారు. దీంతో గుత్తేదారు పైపైన ప్లాస్టరింగ్ చేసి కప్పేశారు. కానీ వెనుకభాగంలో మళ్లీ పగుళ్లు కనిపిస్తున్నాయి. బేస్‌మెంట్ రాయి వరుస చూసిన స్థానికులు ముక్కున వేలేసుకున్నారు. రెండు ప్రాంతాల్లో వెచ్చిస్తున్న వ్యయం దాదాపు అక్షరాలా రూ.8 కోట్లు.

రోడ్డుపైనే విక్రయాలు

విక్రయదారులకు ప్రత్యేక స్థలాలు లేకపోవడంతో తాండూరు, పరిగి,



వికారాబాద్, కొడంగల్ పట్టణాల్లో రోడ్లపైనే ఇరుగ్గా కూరగాయలు, పండ్లు, మాంసం విక్రయాలు జరుగుతున్నాయి. తాండూరులో ఒకటి ఒకచోట దొరికితే మరొకటి ఇంకో బజారుకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో అధిక వ్యయ ప్రయాసలకు గురి కావాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. జిల్లా కేంద్రంతో పాటు మిగతా మూడు పురపాలికల్లోనూ పనులు సత్వరం పూర్తిచేయాల్సి ఉంది.

పనులు నిలిపేశాం

ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కమిషనర్, కొడంగల్

కొడంగల్ మార్కెట్ పనులను ఉన్నతాధికారులు పరిశీలించి నాణ్యతగా లేవని పేర్కొనడంతో వెంటనే నిలిపివేశాం. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఎలాంటి చర్యలు తీసుకోం.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం

శ్రీనివాసన్, మున్సిపల్ కమిషనర్, పరిగి

బేసిమెంట్ బీటలు వారుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించాం.

# అనుమతి లేకుంటే జరిమానా



కరీంనగర్ : గతంలో ఇంటి అనుమతి కోసం దరఖాస్తు చేస్తే రోజుల తరబడి అనుమతుల కోసం ఎదురు చూడాల్సి వచ్చేది. తెలంగాణ రాష్ట్ర భవన అనుమతి ఆమోదం, స్వీయ ధ్రువీకరణ విధానం (టీఎస్‌బీపాస్) అమల్లోకి వచ్చినప్పటి నుంచి నూతన భవనాలకు అనుమతులు తీసుకునేందుకు ప్రజలు ముందుకొస్తున్నారు. దాంతో జిల్లాలోని నగర, పురపాలికల్లో కొత్తగా ఇంటిని నిర్మించేందుకు ముందుగా పట్టణ ప్రణాళిక ద్వారా పర్మిషన్ తీసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అక్రమ నిర్మాణంతో లేనిపోని చిక్కుల్లో పడటం కంటే అనుమతి తీసుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

బీపాస్.. ప్రత్యేకతలు

కొత్త పురపాలక చట్టం–2019 ప్రకారం భవన నిర్మాణ అనుమతులకు ప్రత్యేక విధానం రావడంతో పాటు నిర్దిష్ట సమయంలో అనుమతి జారీ అవుతుంది. మొబైల్ యాప్, టీఎస్‌బీపాస్ వెబ్‌సైట్, మీసేవా, ఈసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి కావాల్సిన నక్షలు, ధ్రువీకరణలు పొందుపర్చాల్సి ఉంటుంది.

తప్పుడు సమాచారమిచ్చినా, మాస్టర్‌ప్లాన్ జోనింగ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరిగినట్లు గుర్తిస్తే అనుమతి పొందిన 21 రోజుల్లో రద్దు చేసే అధికారం ఉంది. స్వీయ ధ్రువీకరణ ద్వారా అనుమతులు పొందితే 21 రోజుల తర్వాత పనులు ప్రారంభించాలి. స్వీయ ధ్రువీకరణతో టీఎస్ బీపాస్ ద్వారా అనుమతులు పొందిన అన్ని భవనాల వివరాలు వెబ్‌సైట్‌లో ఉంటాయి.

అనుమతులకు విరుద్ధంగా నిర్మించినట్లు ఫిర్యాదులు వస్తే నిర్ణీత గడువులోగా కూల్చే అధికారం టాస్క్‌ఫోర్స్ కమిటీకి ఉంటుంది.

ప్రస్తుతం అనుమతుల కోసం దరఖాస్తు చేస్తే చాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇరవైఒకటి రోజుల్లోపే ఇంటి అనుమతి వస్తోంది.

ఇంటి పర్మిషన్ వైపే ఆసక్తి

నూతన భవన నిర్మాణాల జోరు పెరిగింది. శివారు ప్రాంతాల్లో కొత్త నిర్మాణాల సంఖ్య విస్తరిస్తోంది. అదే స్థాయిలో ఇంటి అనుమతులు తీసుకోవడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఏటా 1,662 కొత్తగా ఇళ్లు నిర్మించుకోగా, కరీంనగర్ నగర పరిధిలో ఏడాదికి 1,249 ఇళ్లను నిర్మించుకున్నారు. వీటితో పాటు అనధికారిక, అక్రమ నిర్మాణాల లెక్కనే లేదు.

అలా అయితే భారం మోయాల్సిందే

అనుమతులకు పెద్దమొత్తం ఫీజు చెల్లించాల్సి వస్తుందని, అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుందనే భయంతో పట్టణ ప్రణాళిక ద్వారా ఇంటి అనుమతులు తీసుకోవడానికి యజమానులు ముందుకు రావడం లేదు. అనుమతులు తీసుకోకపోతే భారమనే విషయాన్ని మాత్రం గుర్తించడం లేదు. నిర్మాణం పూర్తయిన తర్వాత కొత్త ఇంటి నంబర్ కోసం దరఖాస్తు చేసే సమయంలో ఈ విషయం బయట పడుతుంది.

అనుమతిపత్రం లేకపోతే ఆస్తిపన్ను మదింపులో జరిమానా విధిస్తున్నారనే విషయాన్ని గుర్తించాలి. మొత్తమే అనుమతి లేకపోతే వందశాతం, అనుమతి తీసుకొని ఒకట్రెండు అంతస్థులు, అదనపు నిర్మాణాలుంటే 25 నుంచి 75 శాతం వరకు అదనంగా పన్ను విధిస్తున్నారు. పైగా ఇలాంటి వాటికి జాతీయ బ్యాంకుల్లో రుణం కూడా ఇవ్వరు. ఈ విషయాన్ని ప్రచారం చేయకపోవడంతో అనధికారిక కట్టడాలు కూడా పెరిగిపోతున్నాయి.

# ఆదా చేసే ఇళ్లకే అనుమతి

హైదరాబాద్: పర్యావరణహిత నివాస సముదాయాలవైపు జీహెచ్ఎంసీ దృష్టి సారించింది. కొత్త భవనాలకు ఈసీబీసీ (ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్) ధ్రువీకరణను తప్పనిసరి చేసేందుకు కసరత్తు ప్రారంభించింది. నగర ప్రణాళిక విభాగం ఆమేరకు అధికారులు, నిపుణులతో చర్చలు ప్రారంభించింది. ఈ నియమావళిని వర్తింపజేస్తే రాబోయే ప్రాజెక్టుల స్వరూపం కొత్త పుంతలు తొక్కుతుంది. గాలి, వెలుతురు పూర్తిస్థాయిలో ప్రసరించేలా ఇళ్ల నిర్మాణం జరుగుతుంది. విద్యుత్తు బల్బులు, శీతల యంత్రాల అవసరం తగ్గుతుంది. నిర్మాణ రంగం ఆ దిశలోకి మారడం కొద్దిగా కష్టమైనప్పటికీ నగరంలోని నిర్మాణాలకు ప్రపంచస్థాయిలో ఆదరణ లభిస్తుందని జీహెచ్ఎంసీ ప్రణాళిక విభాగం స్పష్టం చేస్తోంది.

తప్పనిసరి చేస్తోన్న పరిస్థితులు..

దేశవ్యాప్తంగా సంప్రదాయ ఇంధన వనరులు నానాటికీ తగ్గుతున్నాయి. మితిమీరిన విద్యుత్తు, శిలాజ ఇంధనాల వినియోగంతో వాతావరణ కాలుష్యం పెరుగుతోంది. గృహోపకరణాలు, ఇంట్లో ఉపయోగించే రకరకాల విద్యుత్తు యంత్రాల వినియోగమూ విపరీతమవుతోంది. ఇవన్నీ భవిష్యత్తును చీకటి చేసే పరిణామాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నష్ట నివారణ చర్యల్లో భాగంగా కేంద్ర సర్కారు ఇంధన



పొదుపునకు ఈసీబీసీని అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో వాణిజ్య భవనాలకు 2018లోనే ఈసీబీసీని తెలంగాణ తప్పనిసరి చేసింది. 2022లో నివాస సముదాయాలకూ వర్తింపజేయాలనే చర్చ వచ్చినా ప్రభుత్వం అనుమతించలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో సర్కారు అనుమతిస్తే భారీ నివాస సముదాయాలకు వర్తింపజేస్తారు. అయితే నిర్మాణ విస్తీర్ణం 1000–2000 చదరపు మీటర్లు ఉండే నివాస సముదాయాలు, కార్యాలయాలు, గేటెడ్ కమ్యూనిటీలకు ఈసీబీసీని తప్పనిసరి చేయాలనే ప్రతిపాదన.

తప్పనిసరి చేస్తే..

నిర్మాణాల్లో తలుపులు, కిటికీల పరిమాణం పెరుగుతుంది. దానికి తగ్గట్టుగా పైకప్పు, గోడలు, నీటి పంపిణీ వ్యవస్థ, గృహోపకరణాలు అవసరమవుతాయి. బల్బులు, ఏసీల సంఖ్య తగ్గుతుంది. వర్షపునీటి ఆదా, సౌర విద్యుత్తు వినియోగం తప్పనిసరి అవుతుంది.

ప్రమాణాలన్నీ నిర్మాణ డిజైన్లలో ఉండాలి. గుర్తింపు పొందిన సంస్థలు డిజైన్లను పరిశీలించి, ఈసీబీసీ ధ్రువీకరిస్తే నిర్మాణ అనుమతి మంజూరవుతుంది. నియమావళి అమలును పరిశీలించాక.. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ అవుతుంది. ఆకర్షణీయ నిర్మాణాలు సాకారమైతే.. ప్రపంచస్థాయి కార్యాలయాలకు నగరం వేదికవుతుంది. పర్యావరణ హిత వాతావరణం విస్తరిస్తుంది.

విద్యుత్తు ఛార్జీలు తగ్గుతాయి. పునరుత్పాదక ఇంధన వినియోగం పెరుగుతుంది. ఇంటి నిర్వహణ ఖర్చు కూడా దిగొస్తుంది. ప్రజారోగ్యం మెరుగవుతుంది.

# భూ మాఫియాపై పోలీసుల నజర్



కరీంనగర్: భూ ఆక్రమణదారులపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నారు.. బాధితులు ఇస్తున్న ఫిర్యాదుల ఆధారంగా కేసులు, విచారణలతో దూకుడును పెంచుతున్నారు.. తాజాగా నగరం నడిబొడ్డున ఓ బాధితుడి ఇంటి స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించారని.. ఓ కార్పొరేటర్‌తోపాటు మరో వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఏళ్ల తరబడి బాధితుడు అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా.. కనిపించని ఫలితం సిట్ బృందం విచారణతో కొలిక్కి వచ్చింది. ఇటీవల కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో ముఖ్యంగా కార్పొరేషన్‌ను ఆనుకుని ఉన్న విలువైన భూముల విషయంలో ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయని.. కొంతమంది భూ దందాదారులు ఆక్రమణలకు పాల్పడుతూ యజమానులకు అన్యాయం చేస్తున్నారని భావించిన సీపీ అభిషేక్ మహంతి ప్రత్యేక విచారణ బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. దీనికి ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ అని పేరు పెట్టారు. దీంతో రంగంలోకి దిగిన ఆ బృందం ఆయా ఠాణాల పరిధిలో గతంలో భూముల విషయంలో అందిన ఫిర్యాదులతో పాటు కొత్తగా వస్తున్న వాటిని పరిశీలించి తగు విచారణలు చేపడుతున్నారు. ఈ అధికారుల బృందానికి ఇప్పటి వరకు 10 దరఖాస్తులు అందగా.. అందులో నాలుగు విచారణ దశలో ఉన్నాయి. మరోవైపు రెవెన్యూ అధికారుల సలహాలు తీసుకుని న్యాయపరంగా ముందుకెళుతున్నారు. భూముల విషయంలో అసలైన హక్కులున్న వారికి న్యాయం జరిగే విధంగా చొరవ చూపుతున్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలో కొత్తగా ప్రభుత్వం ఏర్పాటవడం.. జిల్లా నుంచి కూడా హైదరాబాద్‌లోని ప్రజా దర్బార్‌కు కొన్ని భూ సమస్యల్ని పరిష్కరించాలనే విన్నపాలు వెళ్లడంతో ఈ తరహా చర్యల్లో వేగం పెరుగుతోంది. జిల్లా పాలనాధికారితోపాటు పోలీసులకు అక్కడి నుంచి అందుతున్న ఆదేశాలతో ఈ మేరకు ఆక్రమణల చెరలో ఉన్న భూములను అసలైన హక్కుదారుల హస్తాల్లోకి చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

అడ్డుకట్ట పడేనా? కరీంనగర్ నగరపాలక సంస్థతోపాటు రేకుర్తి, తీగలగుట్టపల్లి, బొమ్మకల్ శివారులో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణల పాలయ్యాయి. గడిచిన కొన్నేళ్లుగా కొందరు తమకున్న పలుకుబడితో ప్రభుత్వ, ప్రైవేటు భూములను ఆక్రమించుకున్నారు. పోలీసులు వీరిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ప్రకటించినా ఆచరణకు నోచుకోలేదు. బొమ్మకల్ సమీపంలో వందలాది ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయని ఆ గ్రామస్థులు 2020 ఆగస్టు నెలలో వరుసగా ఆందోళనలు చేపట్టారు. రెవెన్యూ, పోలీసు అధికారులు టాస్క్‌ఫోర్స్ పేరిట ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి హడావుడి చేసి కొందరిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించారు. అక్కడక్కడా ప్రభుత్వ భూములను గుర్తించి బోర్డులు పాతారు. తరవాత షరా మామూలే. రేకుర్తి సమీపంలోని ప్రభుత్వ భూములను ఆక్రమించినా అటు పోలీసులు, ఇటు రెవెన్యూ అధికారులు మొక్కుబడి చర్యలతో మమ అనిపించారనే ఆరోపణలున్నాయి. బాధితులు పలుమార్లు ప్రజావాణిలో విన్నవించినా స్పందన లభించలేదు. తాజాగా సీపీ తీసుకున్న చొరవతోనైనా ఆక్రమణదారుల ఆగడాలకు అడ్డుకట్ట పడుతుందా అన్న చర్చ జరుగుతోంది. భూ దందాల్లో ఏ స్థాయి వాళ్లున్నారనేది ఇప్పటికే పోలీసులకు, రెవెన్యూ అధికారులకు తెలుసు. వారిపై తగు చర్యలు ఉండే విధంగా కార్యాచరణ ఉంటే విలువైన ప్రభుత్వాస్తికి రక్షణ ఏర్పడటంతోపాటు భూమి హక్కుదారుల చింత తొలిగే వీలుంటుంది. ఈ దిశగా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధను కనబర్చాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# ఉగాది నాటికి చర్లపల్లి రైల్వే టర్మినల్

వికారాబాద్ :దశాబ్దాలపాటు సరిపడా రైల్వే స్టేషన్లు లేక.. నగరంలో తిరిగేందుకు సబర్బన్ రైళ్లు లేక అవస్థలు పడిన రైల్వే ప్రయాణికులకు త్వరలోనే ఊరట లభించనుంది. నగర ప్రయాణికుల భారాన్ని మొత్తం మోసిన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు ప్రత్యామ్నాయంగా చర్లపల్లిలో నిర్మిస్తున్న శాటిలైట్ టర్మినల్ ఈ ఏడాది ఉగాది నాటికి అందుబాటులోకి రానుంది. సికింద్రాబాద్ ఎంపీ, కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి ఈ ప్రాజెక్టు త్వరగా పూర్తయ్యేలా ప్రయత్నిస్తున్నారు. మార్చినాటికి పూర్తి చేసే దిశగా పనులు సాగుతున్నాయని ఇటీవల కిషన్‌రెడ్డి స్టేషన్ నిర్మాణ పనుల వీడియోను సామాజిక మాధ్యమంలో విడుదల చేశారు. ఇదే సమయంలో చర్లపల్లి మీదుగా ఘట్‌కేసర్ వరకూ నిర్మించతలపెట్టిన ఎంఎంటీఎస్ రెండోదశ కూడా ఈ లోపే పూర్తి కానుంది.

ప్రయోజనాలు: వందేళ్లుగా నగర ప్రజల ప్రయాణ అవసరాలను తీర్చుతున్న సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ స్టేషన్లు రద్దీని తట్టుకోలేకపోతున్నాయి. తాజా అభివృద్ధి పనులతో చర్లపల్లి నుంచి 25 జతల ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలకు వెసులుబాటు కలుగుతుంది. ఎంఎంటీఎస్ రైళ్ల కోసం కొత్త లైన్లు, ప్లాట్‌ఫామ్స్ అందుబాటులోకి వస్తాయి. 4 వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో అత్యాధునిక సౌకర్యాలతో స్టేషన్ భవనం అందుబాటులోకి వస్తుంది. లిఫ్టులు, ఎస్కలేటర్లు ఐదేసి చొప్పున నిర్మిస్తున్నారు. ఇక్కడ రూ. 350 కోట్ల అంచనాతో పనులు చేపట్టారు. అదనంగా మరో నాలుగు ప్లాట్‌ఫామ్స్ సిద్ధమౌతున్నాయి.



పాదచారుల వంతెనలు, 5 ఎస్కలేటర్లు, 9 లిఫ్టులు, కొత్త స్టేషన్ భవనం సమకూరుతాయి. దూర ప్రాంతాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లు నడిపితే.. లోకల్‌గా తిరిగే ఎంఎంటీఎస్ రైళ్ల కు ఆటంకాల సమస్య కూడా తొలగిపోనుంది.

అక్కడ దిగి.. ఎంఎంటీఎస్‌లో నగరానికి

దూర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్ల నుంచి చర్లపల్లిలో దిగి ఔటర్ రింగురోడ్డు మీదుగా ఇళ్లకు రావొచ్చు. లేదా రెండో దశలో అందుబాటులోకి వస్తున్న ఎంఎంటీఎస్ రైళ్ల ద్వారా నగరంలోకి చేరుకోవచ్చు. ఎంఎంటీఎస్‌ల కోసం ప్రత్యేకంగా ప్లాట్‌ఫామ్‌లు నిర్మించడంతో పాటు.. రెండు లైన్లు అందుబాటులోకి వచ్చాయి. మౌలాలి నుంచి చర్లపల్లికి నాలుగు లైన్లు అందుబాటులో ఉన్నాయి. మౌలాలి నుంచి సికింద్రాబాద్‌కు కేవలం రెండు లైన్లే ఉన్నాయి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను బైపాస్ చేస్తూ మౌలాలి – సనత్‌నగర్ మధ్య రెండో లైను సిద్ధమవ్వడంతో నగరంలోకి ఎక్కడా ఆలస్యం కాకుండా రైలు సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి.

# అసంపూర్తి నిర్మాణాలు.. అంగన్‌వాడీల్లో అవస్థలు

ముస్తాబాద్: అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణ పనులు నిధుల లేమితో ముందుకు సాగడం లేదు. మరోవైపు కనీస సౌకర్యాలు లేక చిన్నారులు ఆట పాటల చదువులకు దూరమవుతున్నారు. ఇరుకు గదుల్లో అరకొర వసతుల మధ్య ఏళ్ల తరబడి కాలం వెల్లదీయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చి చూసి వెళుతున్నారే తప్ప సమస్య పరిష్కారానికి కృషి చేసిన దాఖలాలు లేవు. అసంపూర్తి భవనాలపై ప్రత్యేక కథనం.

ముస్తాబాద్ మండలంలో 22 గ్రామాలకు గాను 52 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మినీ కేంద్రం ఒకటి ఉంది. 23 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. 28 కేంద్రాలను ప్రాథమిక పాఠశాలల గదుల్లో, అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. 52 అంగన్‌వాడీ కేంద్రాలకుగాను 5 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అన్ని కేంద్రాల్లో కలిపి 2,364 మంది చిన్నారులు ఉన్నారు. మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రం పక్కన ఉన్న ప్రాథమిక పాఠశాల ఆవరణలోని ఒకే గదిలో ఏళ్ల తరబడి నాలుగు కేంద్రాలు నిర్వహిస్తున్నారు. పోత్గల్‌లో అంబేద్కర్‌నగర్‌లోని మహిళా సంఘం అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇరుకు గదుల్లో చిన్నారుల చదువులు కొనసాగుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల సమీపంలో సరైన స్థలం లేకపోవడంతో పెరటి తోటలు కనిపించే దాఖలాలు లేవని చిన్నారుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

నిధుల లేమితో...

డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు కాగా ఒక్కో భవనం రూ. 7 లక్షల వ్యయంతో నిర్మాణ పనులు ప్రారంభించారు. ముస్తాబాద్ మండల వనరుల కేంద్రం సమీపంలో, పోత్గల్ ప్రాథమిక పాఠశాల (కట్టమీది బడి) ఆవరణలో, గన్నెవారిపల్లెలో ప్రాథమిక పాఠశాల పక్కనే అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ముస్తాబాద్, పోత్గల్, గన్నెవారిపల్లెలో నిధుల లేమితో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. మరో రూ. 7 లక్షలు మంజూరు చేస్తే పనులు పూర్తవుతాయని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. అదే



డీఎంఎఫ్‌టీ నిధులు ఒకేసారి రూ. 14 లక్షలు మంజూరు చేయడంతో ముస్తాబాద్ మండల కేంద్రంలోని కేసీఆర్ కాలనీ రెండు పడక గదుల ఇళ్ల మధ్య నిర్మించిన నూతన అంగన్‌వాడీ కేంద్రం పనులు చివరి దశకు చేరుకున్నాయి. త్వరలో ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నారు. మిగిలిన వాటికి కూడా నిధులు మంజూరు చేసి భవనాల పూర్తికి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిధులు రాగానే పనులు ప్రారంభం

డీఎంఎఫ్‌టీ నిధులతో మూడు గ్రామాల్లో ఒక్కొక్కటి రూ.7 లక్షల చొప్పున మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు మంజూరయ్యాయి. ముస్తాబాద్, పోత్గల్, గన్నెవారిపల్లె గ్రామాల్లో నూతన భవన నిర్మాణాలు చేపట్టాం. అయితే నిధుల లేమితో పనులు మధ్యలో నిలిచిపోయాయి. మరో రూ. 7 లక్షల చొప్పున మంజూరు చేస్తే పూర్తయ్యే అవకాశం ఉంది. ముస్తాబాద్ మండల కేంద్రంలోని కేసీఆర్ కాలనీలోని భవనం పనులు చివరి దశకు చేరుకున్నాయి. భవనాన్ని త్వరలో ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నాం. మూడు గ్రామాల్లో నిలిచిపోయిన భవనాలకు నిధులు రాగానే పనులు ప్రారంభించేందుకు చొరవ చూపుతాం

.ఇనాయితుల్లా, పంచాయతీరాజ్ ఏఈ

# ఇంటికి భద్రత.. ఆస్తులకు రక్షణ

హైదరాబాద్ : గతేడాది బాలానగర్, బోయిన్‌పల్లి, కాచిగూడ, పాత నగరాల్లో అగ్ని ప్రమాదాలు స్థానికులను భయభ్రాంతులకు గురిచేశాయి. సెల్లార్లలో, ఇంటి ముందు నిలిపిన విద్యుత్ వాహనాల నుంచి పొగలు, ఎలక్ట్రిక్ వైరింగ్‌లో లోపాలు, నాసిరకం విద్యుత్ ఉపకరణాలు పాడవ్వడంతో నిప్పు రవ్వలు రేగి క్షణాల్లో అవి అగ్నికీలలుగా మారుతున్నాయి. ఇలాంటి ప్రమాదాలు సంభవించినప్పుడు అప్రమత్తం చేసి నిలువరించేందుకు 'ఫైర్ అలారమ్', 'స్మోక్ లేదా ఫైర్ డిటెక్టర్', 'ఫైర్ ఎక్స్‌టింగ్విషర్'ను ప్రతి ఇంట్లో ఏర్పాటు చేసుకోవాలని అగ్నిమాపకశాఖ చెబుతోంది. కుటుంబ భద్రతకు రూ.5వేలు ఖర్చు పెడితే చాలని సూచిస్తున్నారు. ఆన్‌లైన్ డెలివరీ ప్లాట్‌ఫామ్ వేదికపై ఫైర్ అలారమ్ ధరలు రూ.800 నుంచి మొదలవుతున్నాయి. స్మోక్ లేదా ఫైర్ డిటెక్టర్ రూ.1200 నుంచి, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ పరిమాణాన్ని బట్టి రూ.3వేల నుంచి అందుబాటులో ఉన్నాయి ఉద్ధృతంగా చెలరేగే మంటలను ఒక్కసారిగా ఆర్పేసే ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ బంతులు అందుబాటులో ఉండగా.. రూ.700




నుంచి ఆపైన ఇవి లభిస్తున్నాయి.

నివాస గృహాల్లోనే ఎక్కువగ్రేటర్‌లో ఏటా 1300 స్వల్పస్థాయి, 30 మధ్యస్థ, 20 తీవ్రస్థాయి అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ ప్రమాదాల్లో ఏటా 200 మంది ప్రాణాలతో బయటపడుతుండగా.. గత మూడేళ్లలో పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. గతేడాది కూకట్‌పల్లి, బాలానగర్, మల్కాజిగిరి పరిధిలో నివాస గృహాల్లోనే ప్రమాదాలు సంభవించాయి. బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య కాంప్లెక్స్‌ల నిర్మాణ సమయంలోనే అగ్నిమాపక నిబంధనలు పాటించడంపై అధికారులు ప్రత్యేక నజర్ పెడుతున్నారు. నివాస గృహాల్లో స్వీయ పర్యవేక్షణ ఉండాలని సూచిస్తున్నారు.



# గౌతమ్ సవాంగ్ ఐపీఎస్‌కు అనర్హుడు

## రాజకీయ పునరావాస కేంద్రంగా ఏపీపీఎస్సీ: చంద్రబాబు

అమరావతి: సమర్ధ ఛైర్మన్ లేకపోతే ఏపీపీఎస్సీ బోర్డు అంతా సర్వనాశనమవుతుందని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. ఏపీపీఎస్సీ అక్రమాలపై ఆయన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. "ప్రతి ఒక్కరి ఆశ ప్రజాసేవ. ప్రజలకు సేవలందించాలని కొంత మంది గ్రూప్ పరీక్షలకు వస్తారు. మా హయాంలో నిజాయతీ గల వ్యక్తులను ఛైర్మన్‌గా నియమించాం.

ఇప్పుడు రాజకీయ పునరావాస కేంద్రంగా ఏపీపీఎస్సీ మారిపోయింది. రాష్ట్ర యువతను దుర్మార్గంగా దగా చేసి వారి ఆశలు చంపేశారు. ఛైర్మన్‌గా నిక్కచ్చిగా వ్యవహరించిన ఉదయ్‌భాస్కర్‌ను మెడపట్టి బయటకు పంపారు. జగన్‌కు అనుకూలం గా వ్యవహరించిన గౌతమ్ సవాంగ్‌ను నియమించారు. 2018లో గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో అవినీతి రాజ్యమేలింది. గౌతమ్ సవాంగ్ ఏపీపీఎస్సీ ఛైర్మన్ అయ్యాక దురాలోచనకు తెరలేపారు. వాల్యుయేషన్‌ను దాచిపెట్టి మళ్లీ రెండోసారి చేశారు. రెండో మూల్యాం కనం జరగలేదని కోర్టుకు చెప్పారు. జరిగిందనడానికి ఆధారాలు ఇస్తున్నాం. మాన్యువల్ వాల్యుయేషన్‌కు వచ్చిన వారి కోసం రూ.20 లక్షలు ఖర్చు పెట్టారు. ఆవాస రిసార్ట్‌కు ఈ మొత్తం చెల్లించినట్లు బిల్లులు ఉన్నాయి. స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతకు కర్నూలు నుంచి కానిస్టేబుళ్లను తీసుకొచ్చారు. క్షమించరాని నేరం చేసిన దుర్మార్గుల్ని ఏం చేసినా తప్పులేదు. నిరుద్యోగ యువత పట్ల క్రూర మృగాలకంటే ఘోరంగా వ్యవహరించారు. నిరుద్యోగులకు వెలుగులు పంచాల్సిన ఏపీపీఎస్సీ చీకట్లు నింపింది. ఫిబ్రవరి 2022లో గ్రూప్-1 ఫలితాలు విడుదల చేస్తామనలేదా? ఈమేరకు సొంత పత్రిక సాక్షిలో కూడా కథనాలు రాసింది నిజం కాదా? ఏపీపీఎస్సీ కార్యదర్శిగా వ్యవహరించిన సీతారామాంజనేయులు అక్రమాల్లో భాగస్వామి. మూల్యాంకనం ప్రక్రియలో బరితెగించి కోర్టును కూడా తప్పుదోవ పట్టించాలని చూశారు.

తాడేపల్లి ప్యాలెస్ పెద్దలకు కావాల్సిన అభ్యర్థుల కోసం అక్రమాలకు పాల్పడ్డారు. అందుకు తగ్గట్టుగా ఛైర్మన్ స్థాయిలో గౌతమ్ సవాంగ్ సహకరించారు. ఇన్ని అక్రమాలకు తావిచ్చిన ఆయన ఐపీఎస్‌కు అనర్హుడు." అని చంద్రబాబు విమర్శించారు.



# ఎన్నికల బాండ్ల పూర్తి డేటా ఎందుకు ఇవ్వలేదు?

దిల్లీ: ఎన్నికల బాండ్ల వ్యవహారంలో భారతీయ స్టేట్ బ్యాంక్‌పై సుప్రీంకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాల ప్రకారం బాండ్ల పూర్తి వివరాలను కేంద్ర ఎన్నికల సంఘానికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించింది. దీనిపై ఆ బ్యాంక్‌కు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను మార్చి 18వ తేదీకి వాయిదా వేసింది. ఎన్నికల బాండ్లపై కేంద్ర ఎన్నికల సంఘం దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. బాండ్ల ఆల్ఫా న్యూమరిక్ నంబర్లను ఎస్‌బీఐ తమకు సమర్పించలేదని ఈసీ న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది. దీంతో బ్యాంకుపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. "బాండ్ల నంబర్లు లేకపోవడంతో ఎవరు ఎవరికి ఎంత ఇచ్చారన్నది స్పష్టంగా తెలియడం లేదు. అన్ని వివరాలను వెల్లడించాలని మేం తీర్పులోనే పేర్కొన్నా.. మీరు ఎందుకు ఇవ్వలేదు" అని కోర్టు ప్రశ్నించింది. దీనిపై బ్యాంక్‌కు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను మార్చి 18వ తేదీకి వాయిదా వేసింది. ఆలోగా తమ ఆదేశాలు ఎందుకు అమలు చేయలేదో వివరణ ఇవ్వాలని ఎస్‌బీఐని ఆదేశించింది. ఎన్నికల బాండ్లకు సంబంధించిన అన్ని వివరాలను సోమవారం నాటికి ఈసీకి అందజేయాలని స్పష్టం చేసింది. బాండ్ల నంబర్లతో రాజకీయ పార్టీలకు ఏ దాత ఎంత విరాళం ఇచ్చారనేది తెలుస్తుంది. ఎన్నికల బాండ్లపై మార్చి 11న ఇచ్చిన తీర్పును కొంత సవరించాలని కోరుతూ ఎన్నికల సంఘం ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. 2019 ఏప్రిల్ 12వ తేదీకి ముందు జారీ అయిన బాండ్లు, వాటిని ఎన్‌క్యాష్ చేసుకున్న రాజకీయ పార్టీల వివరాలను సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ఈసీ గతంలో రెండు సార్లు సీల్డ్ కవర్‌లో సమర్పించింది. అయితే, ఇటీవల ఏప్రిల్ 19 నుంచి ఫిబ్రవరి 15 వరకు గత ఐదేళ్లలో జారీ చేసిన బాండ్ల వివరాలను ఈసీకి అందజేయాలని ఎస్‌బీఐని ఆదేశించిన సుప్రీం.. అంతకంటే ముందు నాటి బాండ్ల వివరాలను కూడా బహిర్గతం చేయాలని ఈసీకి సూచించింది. ఈ క్రమంలోనే ఎన్నికల సంఘం కోర్టుకు ఆశ్రయించింది. "గోప్యతను పాటించేందుకు నాటి బాండ్ల డాక్యుమెంట్లను మేం సీల్డ్ కవర్‌లో సమర్పించాం. వాటికి సంబంధించి ఇప్పుడు మా వద్ద ఎలాంటి కాపీలు లేవు. వాటిని తిరిగి ఇవ్వండి" అని అభ్యర్థించింది. ఇందుకు ధర్మాసనం అంగీకరించింది. గతంలో ఈసీ ఇచ్చిన వివరాలను స్కాన్ చేసి డిజిటలైజ్ చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఆ తర్వాత ఒరిజినల్ డాక్యుమెంట్లను ఈసీకి ఇవ్వాలని సూచించింది. వాటిని శనివారం సాయంత్రం 5 గంటల్లోపు వెబ్‌సైట్‌లో బహిర్గతం చేయాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది.



## వైసీపీ తీర్థం పుచ్చుకున్న కాపు నాయకుడు ముద్రగడ పద్మనాభం

తాడేపల్లి: కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం అధికార వైఎస్సార్ కాంగ్రెస్‌లో చేరారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎం జగన్ సమక్షంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ కండువాను కప్పి జగన్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ముద్రగడ పద్మనాభంతో పాటు ఆయన కొడుకు గిరి కూడా వైసీపీలో చేరారు. వైసీపీలో ముద్రగడ చేరిక కార్యక్రమంలో ఆ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ పీవీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు (తూర్పుగోదావరి జిల్లా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు), ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఇక ముద్రగడ పద్మనాభం పొలిటికల్ కెరియర్ విషయానికి వస్తే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా పనిచేశారు. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల్లో మంత్రిగా కూడా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది.

## సీఎం వైయస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఏపీ పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు

తాడేపల్లి: ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డికి ఏపీ పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ఆర్. రఘురామ్, పలువురు అసోసియేషన్ సభ్యులు సీఎం వైయస్ జగన్‌ను కలిశారు. ఏపీఎస్పీ, ఏఆర్ పోలీస్ సిబ్బందికి బ్యారెట్ క్యాప్ నుంచి పీ క్యాప్ ఇచ్చి డ్రెస్‌కోడ్ మార్చిన ప్రభుత్వం, దీంతోపాటు పోలీసులకు సంబంధించిన పలు అంశాలపై సానుకూలంగా స్పందించిన ముఖ్య మంత్రి ఈ సందర్భంగా సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఏపీ పోలీస్ అసోసియేషన్ స్టేట్ ట్రెజరర్



ఎం.సోమశేఖర్ రెడ్డి, ఈసీ మెంబర్స్ టి.పెద్దయ్య, ఆర్.నాగేశ్వరరావు, జి.అక్కిరాజు, ఎం.సోమయ్య, బి.భవాని, ఎం.కామరాజు.



# రష్యా అధ్యక్ష ఎన్నికలకు కేరళలో పోలింగ్

తిరువనంతపురం: రష్యా అధ్యక్ష ఎన్నికలకు శుక్రవారం పోలింగ్ ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రక్రియలో ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అయితే.. ఈ ఎన్నికల కోసం మన దేశంలోని కేరళలో పోలింగ్ ఏర్పాట్లు చేశారు. ఈ రాష్ట్రంలో నివసించే రష్యన్ పౌరులు ఇక్కడి నుంచే అధ్యక్ష ఎన్నికల్లో తమ ఓటు వేసేందుకు వీలుగా దీన్ని ఏర్పాటు చేశారు. తిరువనంతపురంలోని రష్యన్ హౌస్ (ఆనరరీ కాన్సులేట్ ఆఫ్ రష్యన్ ఫెడరేషన్)లో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తమ పౌరులు ఈ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకోవచ్చని హౌస్ డైరెక్టర్ రతీశ్ నాయర్ తెలిపారు. "రష్యా అధ్యక్ష ఎన్నికలకు కాన్సులేట్‌లో పోలింగ్ నిర్వహించడం ఇది మూడోసారి. ఇక్కడ స్థిరపడిన రష్యన్ పౌరులు, పర్యటకుల కోసం దీన్ని ఏర్పాటు చేశాం. ఇక్కడి నుంచే కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు పౌరులు ఉత్సాహం చూపిస్తుండటం ఆనందంగా ఉంది" అని ఆయన వెల్లడించారు. మార్చి 17 వరకు రష్యా అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఆ తర్వాత కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడు పుతిన్‌కు ప్రత్యర్థులుగా కేవలం ముగ్గురు అభ్యర్థులనే అక్కడి కేంద్ర ఎన్నికల కమిషన్ అనుమతించింది. లిబరల్ డెమోక్రటిక్ పార్టీకి చెందిన లియోనిడ్ స్లట్‌స్కీ, న్యూ పీపుల్ పార్టీ వ్లాదిస్లవ్ దవాంకోవ్, కమ్యూనిస్ట్ పార్టీకి చెందిన నికోలోయ్ ఖరితోనోవ్ పోటీలో ఉన్నారు.

ఈ ముగ్గురూ క్రెమ్లిన్ అనుకూలురే అని తెలుస్తోంది. వ్లాదిమిర్ పుతిన్ రెండు దశాబ్దాలకుపైగా అధికారంలో కొనసాగుతున్నారు. సోవియట్ పాలకుడు జోసెఫ్ స్టాలిన్ కన్నా ఎక్కువకాలం పాటు పదవిలో ఉన్న వ్యక్తిగా నిలిచారు. ప్రస్తుత ఆరేళ్ల పదవీకాలం ఈ ఏడాదితో ముగియనున్న నేపథ్యంలో అక్కడ అధ్యక్ష ఎన్నికలు జరుగుతున్నాయి. ఎక్కువ సార్లు అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలుగా రాజ్యాంగ సవరణ చేసి మరీ.. పుతిన్ మూడోసారి పోటీ పడుతున్నారు. ఈసారీ ఆయన విజయం ఖాయంగానే కన్పిస్తోంది. దీంతో 2030 వరకు ఆయన పదవిలో ఉండనున్నారు. ఆ తర్వాత మరో ఆరేళ్ల కాలానికీ పుతిన్ పోటీ చేసే అవకాశముంది.



# జగనన్నా.. అద్దం ముందు నిల్చొని ప్రశ్నించుకోండి

కడప: అన్నా అని పిలిపించుకున్నవారే హంతకులకు రక్షణ కల్పిస్తున్నారని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డి మరణంతో ఎక్కువగా నష్టపోయింది చిన్నమ్మ సౌభాగ్యమ్మ, ఆయన కుమార్తె సునీతాయేనని చెప్పారు. మాజీ మంత్రి వివేకా ఐదో వర్ధంతి సందర్భంగా కడపలో నిర్వహించిన స్మారక సభలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌పై షర్మిల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయన ఇంతలా దిగజారిపోతారని అనుకోలేదని వ్యాఖ్యానించారు. "హంతకులు ఎవరో కాదు.. బంధువులే అని సాక్ష్యాలు వేలెత్తి చూపుతున్నాయి. బాధితులకు భరోసా ఇవ్వాలన్న ఆలోచన లేకపోగా ఆరోపణలు చేస్తారా?ఇవాళ్టి వరకు హత్య చేసిన, చేయించిన వాళ్లకు శిక్ష పడలేదు. చివరి క్షణం వరకు చిన్నాన్న వైకాపా కోసమే పనిచేశారు. సాక్షిలో పైన వైఎస్ ఫొటో.. కింద ఆయన తమ్ముడి వ్యక్తిత్వ హననం. జగనన్నా.. అద్దం ముందు నిల్చొని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. మీ మనస్సాక్షి ఏం చెబుతుందో వినండి. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తన తోబుట్టువుల కోసం ఏం చేశారో మీకు తెలియదా?ఆయన వారసుడిగా మీరేం చేశారు?" అని షర్మిల నిలదీశారు.



# రోజాకు బిగ్ షాక్..

## మంత్రి రోజాకు బిగ్ షాక్.. ఏకంగా 5 మండలాల నేతలు కలిసి..

తిరుపతి, మార్చి 15: సొంత నియోజకవర్గంలో మంత్రి రోజాకు బిగ్ షాక్ తగిలింది. సొంత పార్టీ నేతలే ఆమె అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తాజాగా నగరినియోజకవర్గ ఐదు మండలాల వైసీపీ నాయకులు ఆమె వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేపట్టారు. తమ నియోజకవర్గానికి రోజా వొద్దని, ఆమెకు టికెట్ ఇవ్వొద్దని సీఎం జగన్‌ను అభ్యర్థించారు. 'జగనన్న ముద్దు - రోజా వద్దు' అంటూ నగరి నియోజకవర్గ 5 మండలాల వైసీపీ నాయకులు ప్లకార్డులు ప్రదర్శించారు. రోజాకు టిక్కెట్టు ఇవ్వొద్దని జగన్‌ను వేడుకుంటున్నామన్నారు. నగరి నియోజకవర్గంలో వైసీపీ కార్యకర్తలు నిరుత్సాహంతో ఉన్నారని, రోజా చరిష్మాతో నగరిలో గెలిచే ప్రసక్తే లేదని వారు పేర్కొన్నారు. తాము సపోర్ట్ చేస్తేనే రోజా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిందన్నారు. ఈసారి రోజాకు సీటు ఇవ్వొదని డిమాండ్ చేశారు. ఒకవేళ రోజాకు టికెట్ ఇస్తే తాము మద్దతివ్వమని.. ఖచ్చితంగా ఓడిపోతుందని స్పష్టం చేశారు అసంతృప్త నేతలు. కార్యకర్తలను రోజా హేళనగా మాట్లాడుతారని పార్టీ శ్రేణులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదిలాఉంటే.. వైసీపీ నేత కె.జె.కుమార్ చేసిన ప్రకటనతో తమకు సంబంధం లేదని.. ఆయనతో కలిసి తాము ఎన్నికల ప్రచారం చెయ్యబోమని స్పష్టం చేశారు నేతలు. నగరి మొత్తాన్ని రోజా, రోజా అన్నదమ్ములు దోచేశారని ఆరోపించారు. తమ అనుచరులను రోజా పోలీసు కేసులతో తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. రోజాతో తాము ఎప్పటికీ కలవబోమని తేల్చి చెప్పారు. పార్టీ అధినేత తమను బుజ్జగించారనడంలో ఏమాత్రం నిజం లేదన్నారు. రోజా వల్ల వైసీపీకి తీరని నష్టం కలుగుతోందన్నారు. అధినేత జగన్ ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని.. రోజాకు టికెట్ కేటాయించొద్దని వైసీపీ అసంతృప్త నేతలు కోరారు.

## చంద్రబాబు నివాసానికి క్యూ కట్టిన నేతలు.. అధినేత భరోసా

అమరావతి: తెలుగుదేశం పార్టీ ప్రకటించిన రెండు జాబితాల్లో చోటు దక్కని ఆశావహులు చంద్రబాబు నివాసానికి క్యూ కట్టారు. నేతలను పిలిచి మాట్లాడుతున్న ఆయన.. వారి రాజకీయ భవిష్యత్తుకు హామీ ఇచ్చి బుజ్జగిస్తున్నారు. పెదకూరపాడు అభ్యర్థిగా భాష్యం ప్రవీణ్‌ను ప్రకటించారు. ఈ నేపథ్యంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌ను జీవీ ఆంజనేయులు తీసుకొచ్చారు. శ్రీధర్ రాజకీయ భవిష్యత్తుకు చంద్రబాబు హామీ ఇచ్చారు. పార్టీ అధికారంలోకి రాగానే తగిన ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. పెదకూరపాడులో తెలుగుదేశం విజయానికి కలిసి పనిచేయాలని సూచించారు. ఎచ్చెర్ల ఇన్‌ఛార్జిగా ఉన్న కళా వెంకట్రావు పేరు రెండో జాబితాలో కూడా లేకపోవడంతో ఆయన వర్గీయుల్లో ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో ఆయన కూడా అధినేతను కలిశారు. రెండు జాబితాల్లోనూ చోటు దక్కకపోవడంతో అసంతృప్తిగా ఉన్న పెనమలూరు ఇన్‌ఛార్జి బోడె ప్రసాద్‌ను బుజ్జగించారు. కాకినాడ మాజీ ఎమ్మెల్యే కొండబాబు.. చంద్రబాబు నివాసానికి వచ్చారు. కాకినాడ అర్బన్ టికెట్ ఇంకా ప్రకటించలేదు. ఈ స్థానం పొత్తుతో ముడిపడి ఉందని ప్రచారం జరుగుతోంది.



# తమన్నా..రాశీ.. ఓకే ఫ్రేమ్ లో స్టన్నింగ్ గ్లామర్

సినీ ఇండస్ట్రీలో ఒక్కో డైరెక్టర్ కు ఒక్కో జోనర్ లో ఒక్కో సిగ్నేచర్ స్టైల్ ఉంటోంది. ఈ విధంగానే కోలీవుడ్ యాక్టర్ కమ్ డైరెక్టర్ సుందర్.సి హారర్ సినిమాలను తెరకెక్కించి అలరిస్తుంటారు. అలా అని ఆయనే కేవలం ఆ జోనర్ చిత్రాలే తీయరు. కానీ ఆయనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టినవి మాత్రం అవే. వీటితోపాటు గ్లామర్ కమర్షియల్ మూవీలు కూడా తెరకెక్కించి హిట్లు కొడుతుంటారు. తన కథ కోసం ఇద్దరు లేదా ముగ్గురు హీరోయిన్లను ఎంచుకుంటుంటారు. ప్రముఖ నటి ఖుష్బూ భర్త అయిన సుందర్.. ప్రస్తుతం అరణ్మనై 4 సినిమాను తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. గతేడాది షూటింగ్ ప్రారంభమైన ఈ మూవీ.. వచ్చే నెలలో విడుదల కానున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో అందాల భామలు తమన్నా, రాశీ ఖన్నా లీడ్ రోల్స్ లో నటిస్తున్నారు. ఎప్పుడూ ఫుల్ గ్లామర్ తో అలరించే ఈ భామలు.. సినిమాలో దెయ్యాలుగా కనిపించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఫస్ట్ లుక్ లో తమన్నాను దెయ్యంగా చూపించారు మేకర్స్. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అందులో తమన్నా తో



పాటు రాశీ ఖన్నా అల్ట్రా గ్లామర్ గా కనిపిస్తున్నారు. స్టైలిష్ ఔట్ ఫిట్ తో ఓ రేంజ్ లో ఆకట్టుకుంటున్నారు. ఎద అందాలతో కవ్విస్తున్నారు. ఓ స్పెషల్ సాంగ్ షూట్ కు సంబంధించిన పిక్ గా అర్థమవుతోంది. బ్యూటీల స్టన్నింగ్ అందాలకు నెటిజన్స్ క్లీన్ బౌల్డ్ అవుతున్నారు. అయితే తెలుగులో ఎప్పుడు ఈ సినిమా రిలీజ్ అవుతుందో, ఏ పేరుతో విడుదలవ్వనుందో ఇంకా తెలియలేదు. కానీ సినిమా కోసం ఎదురుచూస్తున్నట్టు నెటిజన్లు చెబుతున్నారు. ముఖ్యంగా రాశి, తమన్నా గ్లామర్ షో కోసం వెయిటింగ్ అంటూ సరదాగా కామెంట్లు పెడుతున్నారు. అయితే నార్మల్ గా సోషల్ మీడియాలో కూడా వీరిద్దరి గ్లామర్ షో మాములుగా ఉండదన్న విషయం అందరికీ తెలిసిందే. ఇక 2014 లో అరణ్మనై ఫస్ట్ పార్ట్ ను తెరకెక్కించారు సుందర్. హన్సిక, ఆండ్రియా హీరోయిన్స్ గా నటించిన ఈ చిత్రం.. తెలుగులో చంద్రకళ పేరుతో రిలీజై మంచి విజయం అందుకుంది. ఆ తర్వాత అరణ్మనై 2లో త్రిష, హన్సిక నటించగా.. కళావతి పేరుతో మోస్తరు విజయాన్ని దక్కించుకుంది. మూడేళ్ల క్రితం అరణ్మనై 3 తెలుగులో అంతఃపురం పేరుతో రిలీజ్ అయ్యి ఫ్లాప్ టాక్ అందుకుంది. మరి ఇప్పుడు నాలుగో భాగాన్ని సుందర్ ఏ పేరుతో రిలీజ్ చేస్తారో చూడాలి.

# నీతా అంబానీ ఆభరణం 200కోట్లు.. చీర 50లక్షలు

ముఖేష్ అంబానీ భార్య, నీతా అంబానీ సిరి సంపదలలోనే కాకుండా, స్టైల్ అండ్ ఫ్యాషన్ సెన్స్ పరంగాను యువతరం దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఈవెంట్లు కుటుంబ కార్యక్రమాలలో నీతాజీ ధరించే చీరలు, నగలు ఇతర అలంకరణ వస్తువులు పబ్లిక్ దృష్టిని ఎక్కువగా ఆకర్షిస్తుంటాయి. ఇంతకుముందు పెళ్లిలో నీతాజీ ధరించిన ఆభరణం ఖరీదు చూసి అంతా నోరెళ్లబెట్టారు. ఇప్పుడు మిస్ వరల్డ్ 2024 ఈవెంట్లో మొఘల్ చక్రవర్తులు రాణులకు చెందిన ఆభరణాలలో నీతా అంబానీ అబ్బురపరిచింది. ముంబైలో జరిగిన ఈవెంట్లో నీతా అంబానీ తన వేషధారణ ఉపకరణాలతో మరోసారి వీక్షకులను మంత్రముగ్ధులను చేసింది. మెరిసే చేనేత చీరలో ట్రెడిషనల్ గా కనిపించిన నీతా మోడ్రన్ లుక్ లో కనిపించింది. బనారసీ చీర, మెరిసే బంగారం జరీతో చేత్తో రూపొందించిన జంగ్లా డిజైన్ చీరలో కనిపించింది. ఈ చీర భారతదేశ సంస్కృతి... గొప్ప వారసత్వాన్ని ప్రతిబింబించడమే కాకుండా ఆమె రాజరిక సౌరభాన్ని కూడా



ఆవిష్కరించింది. మీనాకరి డీటెయిలింగ్.. పూల జాలు తో సంప్రదాయ హస్తకళా నైపుణ్యంతో రూపొందించిన చీరలో ప్రత్యేకంగా కనిపించింది. మిస్ వరల్డ్ 2024లో మొఘల్ చక్రవర్తికి చెందిన ఆభరణాలలో నీతా అంబానీ అబ్బురపరిచింది. నీతాజీ ఎంపిక నిజంగా స్పాట్‌లైట్‌ను దోచుకుంది. తన చేతికి ఉన్న అలంకారం ఆర్మ్‌బ్యాండ్ చరిత్రలోని ప్రఖ్యాత మొఘల్ చక్రవర్తి షాజహాన్‌కు చెందిన కల్గీ అని తెలిసింది. టోపోఫిలియా అనే ఇన్‌స్టాగ్రామ్ పేజీ లో ఈ ఆభరణం కనిపించింది. దీని ఖరీదు సుమారు 200 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఇది ఐశ్వర్యం వారసత్వానికి అసాధారణ చిహ్నంగా నిలుస్తుంది.

ఈ ఆర్మ్‌బ్యాండ్ 13.7 సెం.మీ ఎత్తు , 19.8 సెం.మీ వెడల్పుతో ఉంది. సాంప్రదాయ పచ్చికకామ్ టెక్నిక్‌ని ఉపయోగించి బంగారంతో అమర్చిన వజ్రాలు, కెంపులు, స్పినెల్‌లతో ఎంతో గొప్పగా దీనిని తయారు చేసారు. ఫ్యాషన్‌లో రాణించాలనే నీతా అంబానీ నిబద్ధత వల్లనే ఈ నగల సేకరణ సాధ్యమైంది. 2018లో తన కుమార్తె ఇషా అంబానీ పెళ్లి రోజు కోసం నీతాజీ తన బృందంతో ప్రత్యక్షమై షాకిచ్చింది. అద్భుతమైన ఆల్-డైమండ్ నగలతో అలంకరించుకుని పెళ్లి వేదికకు వచ్చింది.

ముఖ్యంగా డైమండ్ నాథ్, వజ్రాల పొరలు, భారీ 1LB డైమండ్ లాకెట్టుతో అలంకరించిన ఆభరణం అహూతులందరినీ ఆకర్షించింది. పెళ్లి వేడుకలో నీతాజీ కేంద్ర బిందువుగా మారింది.




# తంగలాన్ రిలీజ్ పై డైరెక్టర్ కామెంట్..!



చియాన్ విక్రమ్ పా రంజిత్ కాంబినేషన్ లో భారీ అంచనాలతో తెరకెక్కిన సినిమా తంగలాన్. విక్రం మరోసారి విలక్షణ మైన పాత్రలో నటించిన ఈ తంగలాన్ సినిమా పూర్తయ్యి చాలా రోజులు అవుతున్నా రిలీజ్ కి మోక్షం కలగట్లేదు. సినిమా ప్రచార చిత్రాలు అంచనాలు పెంచగా చియాన్ ఫ్యాన్స్ అంతా ఈ సినిమా కోసం ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. అసలైతే సినిమాను లాస్ట్ ఇయర్ డిసెంబర్ లోనే రిలీజ్ చేయాల్సి ఉన్నా కొన్ని కారణాల వల్ల ఫిబ్రవరికి వాయిదా వేశారు. మళ్లీ చిత్ర యూనిట్ సినిమా ఏప్రిల్ రిలీజ్ అని రిలీజ్ డేట్ చెప్పారు. ఇక రీసెంట్ ఇంటర్వ్యూలో పా రంజిత్ తంగలాన్ సినిమా రిలీజ్ పై మరో మాట చెప్పారు. సినిమా ఏప్రిల్ కు వస్తుందని ఫ్యాన్స్ కు నిరాశ తప్పేలా లేదు. ఇంతకీ పా రంజిత్ ఏమన్నారు అంటే తంగలాన్ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు వస్తుంది. రిలీజ్ కు సిద్ధంగా ఉంది. సెన్సార్ సర్టిఫికెట్ కు అప్లై చేస్తున్నాం. ప్రజెంట్ ఎన్నికల తేదీల ప్రకటన కోసం వెయిట్ చేస్తున్నాం. ఎలక్షన్స్ పూర్తయ్యాక సినిమా రిలీజ్ చేస్తామని అన్నారు పా రంజిత్. అంతేకాదు ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నానని అన్నారు. పా రంజిత్ ఈ సినిమాను కర్ణాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ కార్మికుల జీవితాల నేపథ్యంతో తెరకెక్కించారు. శివ పుత్రుడు తరహాలో విక్రం డిఫరెంట్ లుక్ తో ప్రేక్షకులను అలరించనున్నారు. సినిమాలో మలయాళ భామ మాళవిక మోహనన్ హీరోయిన్ గా నటించగా పార్వతి తిరువోతు కూడా ఇంపార్టెంట్ రోల్ లో నటించారు. కోలీవుడ్ స్టార్ హీరోలంతా సూపర్ ఫాం కొనసాగిస్తుండగా విక్రం ఒక్కడే వెనకపడ్డాడు. మళ్లీ చియాన్ తిరిగి ఫాం లోకి రావాలని ఆయన ఫ్యాన్స్ కోరుతున్నారు. అయితే సినిమా రిలీజ్ డేట్స్ వల్ల విక్రం అభిమానులు నిరుత్సాహ పడుతున్నారు. ఒక సినిమా రెండు మూడుసార్లు రిలీజ్ వాయిదా పడటం వల్ల ఆ సినిమాపై నెగిటివ్ ఇంపాక్ట్ ఏర్పడుతుంది. అయితే పా రంజిత్ మాత్రం ఎప్పుడొచ్చినా సరే తంగలాన్ ఆడియన్స్ ని మెప్పిస్తుందని చెబుతున్నారు. డైరెక్టర్ గా పా రంజిత్ ప్రతిభ గురించి తెలిసిందే మరి విక్రం తో చేసిన తంగలాన్ తో పా రంజిత్ ఏమేరకు ప్రేక్షకులను అలరిస్తారన్నది చూడాలి.

# 'వార్ 2' తారక్ 60 రోజుల్లో ఫినిష్ చేస్తాడట



యష్ రాజ్ సంస్థ యాక్షన్ డ్రామా వార్ 2లో హృతిక్ రోషన్ - జూనియర్ ఎన్టీఆర్ స్క్రీన్ స్పేస్‌ను పంచుకోనున్న సంగతి తెలిసిందే. రెండు పరిశ్రమలకు చెందిన ఇద్దరు సూపర్ స్టార్లను స్క్రీన్‌పై ఒకే ఫ్రేమ్‌లో చూడాలని అభిమానులు ఇప్పటికే ఉవ్విళ్లూరుతున్నారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా గురించిన ప్రతి అప్‌డేట్ క్షణాల్లో వైరల్ అవుతోంది. తాజా మీడియా కథనాల ప్రకారం.. ఇద్దరు అగ్ర హీరోలు యాక్షన్-ప్యాక్డ్ వార్ 2 కోసం 60 రోజుల పాటు చిత్రీకరణలో పాల్గొనాల్సి ఉందని తెలిసింది. హృతిక్ ప్రస్తుతం ముంబైలో తన ఎంట్రీ సీక్వెన్స్ షూటింగ్‌లో పాల్గొంటున్నాడు. ఇది యాక్షన్-ప్యాక్డ్ స్టంట్. వార్ 2 కోసం హృతిక్ కేవలం 55 నుండి 60 రోజులు మాత్రమే కేటాయించాడు. చాలా భాగం ముంబైలోని స్టూడియోలలో చిత్రీకరిస్తున్నారు. ఆసక్తికరంగా జూన్ 2024 నాటికి వార్ 2లో హృతిక్ పాత్ర చిత్రణ పూర్తి చేయాల్సి ఉంది. అతడు రికార్డ్ సమయంలో చిత్రీకరణను ముగించే చిత్రాలలో ఇది ఒకటి. అతడు మార్చి 7న ముంబై %=ఖీ%లో హృతిక్ ఈ సినిమా షూటింగ్‌ని ప్రారంభించాడు. జూనియర్ ఎన్టీఆర్ వార్ 2 షూటింగ్ ఏప్రిల్‌లో ప్రారంభించి జూలై నెలాఖరుకు పూర్తి చేయనున్నారు. హృతిక్ లాగానే జూనియర్ ఎన్టీఆర్ కూడా వార్ షూటింగ్ కోసం 60 రోజులు కేటాయించారు. ఇందులో 25 నుండి 30 రోజుల పాటు హృతిక్ తో కాంబినేషన్ షూట్ ఉంటుంది. ఏప్రిల్ చివరి నుంచి ఎన్టీఆర్ షూట్ కి వెళతాడని తెలుస్తోంది. %=ఖీ% ఇప్పటికే భారీ చిత్రాలను సమర్థవంతంగా తెరకెక్కించే కళలో ప్రావీణ్యం సంపాదించింది. ఎందుకంటే ఈ టెంప్లేట్‌కు నటీనటుల నుండి ఎక్కువ రోజులు షూట్ అవసరం లేదు లేదా బడ్జెట్ భారం పెంచడం కుదరదు. భారీ సినిమాల షూటింగ్ కోసం %=ఖీ% మరింత అధునాతన సాంకేతికతను ఉపయోగిస్తుందని పేర్కొనడం గమనార్హం. గత ఏడాది నవంబర్‌లో ప్రారంభమైన వార్ 2 తాజా ఉదాహరణ. మీడియా కథనాల ప్రకారం.. అయాన్ ముఖర్జీ అసలు లీడ్ పాత్రధారులు లేకుండా ఇప్పటికే రెండు ఓవర్సీస్ షెడ్యూల్‌లను చిత్రీకరించారు. ఇది యాక్షన్ స్పేస్‌లో అవుట్‌డోర్ షూట్‌లను బాడీ డబుల్స్‌తో మేనేజ్ చేసే అత్యంత ఆధునిక సాంకేతికత.. మేకర్స్ %ఎఖీశ% ఉపయోగించి ముఖాలను మార్చుకుంటారు! అని తెలుస్తోంది. మొత్తం షూటింగ్ జూలై నాటికి పూర్తి చేసి ఆ తర్వాత 8నెలలు కేవలం వీఎఫ్ఎక్స్ సహా నిర్మాణానంతర పనుల కోసం కేటాయిస్తారని తెలిసింది. ఏక్ థా టైగర్ (2012), టైగర్ జిందా హై (2017), వార్ (2019), పఠాన్ (2022), టైగర్ 3 (2023) వంటి సినిమాలతో జోరుమీద ఉన్న %=ఖీ% స్పై యూనివర్స్‌లో వార్ 2 ఆరవ సినిమా. ఈ చిత్రం టైగర్ 3 కి కొనసాగింపు కథాంశాన్ని ముందుకు తీసుకెళుతుంది. చివరికి మోస్ట్ అవైటెడ్ టైగర్ వర్సెస్ పఠాన్ కి కనెక్టవుతుంది. ఈ చిట్టచివరి చిత్రం సల్మాన్ ఖాన్ - షారుక్ ఖాన్ మధ్య హోరాహోరీ వార్ నేపథ్యంలో సాగుతుందని ప్రచారం జరుగుతోంది.

# అనుష్క అక్కడ అంత డిమాండ్ చేసిందా?

టాలీవుడ్ లో అనుష్క క్రేజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఫాంలో ఉన్నంత కాలం అమ్మడిదే నెంబర్ వన్ స్థానం. పోటీగా ఎంత మంది భామలొచ్చినా? ఆ స్థానం మాత్రం ఎవరికీ ఇవ్వకుండా కాపాడుకుంది. కానీ ఆమె ఎగ్జిట్ తర్వాత ఆ స్థానం అలాగే ఉంది. దూకుడుగా ఉన్నంత కాలం అమ్మడు ఇక్కడ భారీగానే పారితోషికం అందుకుంది. ఒక్కో సినిమాకి 10 కోట్లకు పైగానే ఛార్జ్ చేసింది. తనతో స్నేహం గా ఉన్న నిర్మాణ సంస్థలు సినిమాలో వాటా సైతం కల్పించాయి. లేడీ ఓరియేంటెడ్ నాయికగానూ సత్తా చాటింది. అరుంధతి విజయం తర్వాత ఆమెకి ప్రత్యేకమైన ఇమేజ్ క్రియేట్ అయింది. అయితే ఇప్పుడిదే స్టార్ డమ్ అని అమ్మడు మాలీవుడ్ లో సక్సెస్ కాక ముందే ఆస్వాది స్తున్నట్లు కనిపిస్తుంది. కథనార్ అనే



సినిమాతో అక్కడ లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే. ఇటీవలే షూటింగ్ పూర్తిచేసుకున్న సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఈ సినిమాపై భారీ అంచనాలే ఉన్నాయి. ఇందులో జైసూర్య హీరోగా నటిస్తున్నాడు. మరి ఈ సినిమాకి అనుష్క పారితోషికం ఎంత తీసుకుంటుందో? తెలిస్తే షాక్ అవ్వాల్సిందే. సినిమా కోసం ఏకంగా 10 కోట్లు ఛార్జ్ చేసిందిట. అడ్వాన్స్ గా ఆరు కోట్లు ముందే చెల్లించారుట. తాజాగా షూట్ పూర్తయిన నేపథ్యంలో బ్యాలెన్స్ అమౌంట్ కూడా క్లియర్ చేసినట్లు తాజాగా అందుతోన్న సమాచారం. అయితే అమ్మడు అక్కడంత డిమాండ్ చేయడానికి కారణం లేకపోలేదు. తెలుగు మార్కెట్ ని దృష్టిలో పెట్టుకుని చేసినట్లు తెలుస్తోంది. కథనార్ ని మాలీవుడ్ తో పాటు తెలుగులో కూడా ఒకేసారి రిలీజ్ చేయాలన్నది ప్లాన్ గా కనిపిస్తుంది.

ఈసినిమా రీమేక్ రైట్స్ ఎవ్వరికి ఇవ్వకుండా తెలుగు నిర్మాణ సంస్థతో ఒప్పందం చేసుకుని ఇక్కడా రిలీజ్ అయ్యేలా ప్లాన్ చేస్తున్నారుట. రెండు భాషల్లోనూ అనుష్క ప్రచారంలో పాల్గొనెలో ఒప్పందం చేసుకున్నారుట. ఆ ఒప్పందం ప్రకారమే పారితోషికంతో పాటు ప్రచారం కోసం 10 కోట్లు చెల్లించినట్లు తెలుస్తోంది. మొత్తానికి అనుష్క టాలీవుడ్ లో తన బ్రాండ్ ఇమేజ్ ను పరభాషలో కూడా తెలివిగానే ఎన్ క్యాష్ చేసుకుంటుందని చెప్పొచ్చు.

# బ్లాక్ లో మతి పోగొట్టే అందం

2017 లో రొమాంటిక్ రాంచీ డైరీస్ తో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ సౌందర్య శర్మ. ఈ అమ్మడు మొదటి సినిమాతోనే జార?ండ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ లో బెస్ట్ డెబ్యూటెంట్ అవార్డును సొంతం చేసుకుని అందరి దృష్టిని ఆకర్షించింది. మొదటి సినిమా కమర్షియల్ గా నిరాశపరచడంతో ఆఫర్లు దక్కలేదు. 2022-23 మధ్య కాలంలో బిగ్ బాస్ ద్వారా ముద్దుగుమ్మ సౌందర్య శర్మ పాపులారిటీ సొంతం చేసుకుంది. సోషల్ మీడియాలో ఈ అమ్మడికి మంచి ఫాలోయింగ్ క్రియేట్ అయ్యింది. 8.4 మిలియన్ ల ఫాలోవర్స్ తో దూసుకు పోతుంది. రెగ్యులర్ గా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తూ ఉండే ఈ అమ్మడు తాజాగా మరోసారి తన బ్లాక్ డ్రెస్ తో



కూడిన అందమైన ఫోటోను షేర్ చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. నడుము నాభి అందాలను చూపిస్తూ డిఫరెంట్ ఔట్ ఫిట్ తో భలే ఉందే అన్నట్లుగా నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

ఇంత అందంగా ఉన్న ఈ అమ్మడికి ఎందుకు సినీ ఆఫర్లు రావడం లేదు అన్నట్లుగా కొందరు కామెంట్స్ చేస్తూ ఉంటే మరి కొందరు మాత్రం ఇదే రేంజ్ లో సోషల్ మీడియా అందాల ఆరబోత చేస్తే కచ్చితంగా ముందు ముందు బాలీవుడ్ లో బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి అంటున్నారు. ప్రస్తుతం ఈ అమ్మడు ఒకటి రెండు వెబ్ సిరీస్ లల్లో నటిస్తున్నట్టు సమాచారం అందుతోంది.



# సుప్రీంకోర్టులో కవిత ఛాలెంజ్ పిటిషన్!

హైదరాబాద్: ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌పై ఈడీ ప్రకటన చేసింది. సాయంత్రం 5.20 గంటలకు అరెస్ట్ చేశామని, మనీలాండరింగ్ యాక్ట్ కింద కవితను అదుపులోకి తీసుకున్నట్లు ఈడీ పేర్కొంది. కవితను అరెస్ట్ చేసినట్లు ఆమె భర్తకు సమాచారం ఇచ్చామని ఈడీ అధికారులు తెలిపారు. రేపు ఉదయం కవితకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా ఈడీ కార్యాలయానికి తరలించనున్నారు. రేపు మధ్యాహ్నం రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చనున్నారు. ఈ రోజు రాత్రంత ఢిల్లీ ఈడీ కార్యాలయంలోనే కవిత ఉండనున్నారు. కాగా, తన అరెస్టును సవాల్ చేస్తూ రేపు సుప్రీంకోర్టులో కవిత ఛాలెంజ్ పిటిషన్ వేయనున్నట్లు సమాచారం. మరోవైపు, కవిత భర్త అనిల్ ఢిల్లీకి వెళ్తున్నట్లు తెలిసింది. రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగంగానే తనని అరెస్ట్ చేశారని కవిత ఆరోపించారు. న్యాయపరంగా ఎదుర్కొంటామన్నారు.




## బీఆర్ఎస్, బీఎస్పీ మధ్య కుదిరిన సీట్ల ఒప్పందం.. బీఎస్పీకి ఏయే స్థానాలు కేటాయించారంటే?

హైదరాబాద్: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ – బీఎస్పీ పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై స్పష్టత వచ్చింది. పొత్తులో భాగంగా బీఎస్పీకి 2 సీట్లు కేటాయించాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. ఇరుపార్టీల మధ్య చర్చల అనంతరం మాజీ సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. నాగర్ కర్నూల్, హైదరాబాద్ పార్లమెంటు స్థానాలను బీఎస్పీకి కేటాయిస్తున్నట్టు కేసీఆర్ ప్రకటించారు. కాగా ఈ రెండు స్థానాల్లో పోటీ చేయనున్న అభ్యర్థులను బీఎస్పీ ఎంపిక చేసి ప్రకటించనుంది.

# ఎలక్టోరల్ బాండ్లపై సీపీఐ నారాయణ కీలక వ్యాఖ్యలు



ఢిల్లీ: రాజకీయాలను భ్రష్టు పట్టించేందుకే ఎలక్టోరల్ బాండ్లను మోదీ సర్కార్ తీసుకొచ్చిందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. SBI బ్యాంకు అధికారుల వెనుక కేంద్రపెద్దలున్నారని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారంలో బాధ్యతవహించాలని డిమాండ్ చేశారు. క్విడ్ ప్రో కోకు లాభపడిన అందరి వివరాలు బయటకు రావాలని అన్నారు. శుక్రవారం నాడు ఢిల్లీ వేదికగా ఆయన మీడియాతో మాట్లాడుతూ...ఎలక్టోరల్ బాండ్లను మొదటి నుంచి తాము వ్యతిరేకించామని చెప్పారు. ఈ బాండ్ల వ్యవహారంలో SBI బ్యాంకు వ్యవహారశైలి సరిగా లేదని అన్నారు.

# బీఆర్ఎస్‌కు మరో షాక్.. కాంగ్రెస్‌లోకి ఖైరతాబాద్ ఎమ్మెల్యే



హైదరాబాద్: మరికొన్ని రోజుల్లో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న వేళ తెలంగాణలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే పలువురు కీలక నేతలు బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పగా తాజాగా అదే బాటలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కూడా ఉన్నారు. దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో నేడు దానం భేటీ అయ్యారు. ఈ భేటీలో తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ దీపా దాస్ మున్షీ, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు. దానం నాగేందర్ ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. కాగా దానం నాగేందర్ రాజకీయ ప్రయాణం కాంగ్రెస్ పార్టీతో ప్రారంభమైంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆయన మంత్రిగా కూడా పని చేశారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. తాజాగా మళ్లీ హస్తం గూటికి చేరుతున్నారు.

# మాజీ సీఎం కేసీఆర్‌కు మంత్రి పొన్నం కౌంటర్




కరీంనగర్: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుకు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. మేడిగడ్డలో రెండే పిల్లర్లు కుంగాయాని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. "మొన్నటిదాకా అధికారంలో ఉన్నది మీరే కదా.. కాంగ్రెస్ వస్తే..కరువు వస్తుందని అనడం దారుణం.. కేసీఆర్‌కు అవగాహన లేదు.. రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం.. బుద్ధి జ్ఞానం ఉన్నోడు ఎవడూ..మా వల్ల కరువు వచ్చింది" అని అనడని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. కాగా కాళేశ్వరం ప్రాజెక్టులో మూడు పిల్లర్ల కింద ఇసుక జారిపోతే బ్రహ్మాండం బద్దలైనట్లు ప్రచారం చేస్తున్నారని కేసీఆర్ అన్నారు. కరీంనగర్‌లో బీఆర్ఎస్? కదనభేరీ సభలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

# సీఎం రేవంత్ అందులో పోటీ పడుతున్నారు: హరీశ్‌రావు

హైదరాబాద్: 6 గ్యారంటీలపై కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం నాడు తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కిట్లు ఇస్తే, సీఎం రేవంత్ రెడ్డి తిట్లలో పోటీ పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి అయ్యిందని చెప్పారు. వంద రోజుల పాలన మూడు విచారణలు, ఆరు వేధింపులు అన్నట్లుగా ఉందని విమర్శించారు. 6 గ్యారంటీలు 100 రోజుల్లో అమలు చేస్తామని విఫలమయ్యారన్నారు. రైతు రుణమాఫీని ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. ఆసరా పెన్షన్లు పెంచుతామని.. ఉన్న పెన్షన్లు కూడా ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ కరువును పెంచడానికి పోటీ పడుతుందని ఆరోపించారు.

వ్యవసాయాన్ని శిథిలావస్థకు చేర్చుతున్నారని ధ్వజమెత్తారు. రైతు బంధు అడిగితే చెప్పుతో కొడతానని కాంగ్రెస్ నేత అంటున్నారని.. ఇది అధికారంలోకి తీసుకొచ్చినందుకు ఆ పార్టీ ఇచ్చే ఘనత అని చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్యంపై కాంగ్రెస్ నేతలు నీచ రాజకీయం చేస్తున్నారని విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ది యూ టర్న్, యూ ట్యూబ్‌ల పాలన అని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పార్టీ గేట్లు ఎత్తడం కాదని.. ముందుగా ప్రాజెక్టుల గేట్లు ఎత్తి వ్యవసాయానికి నీటిని విడుదల చేయాలని సూచించారు. తాగడానికి నీళ్లు లేక జనం గోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఖాళీ బిందెలు, వాటర్ ట్యాంకర్లు దర్శనమిస్తున్నాయని చెప్పారు. కాంగ్రెస్ వంద రోజుల పాలనలో 174 మంది రైతులు 30మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారి ఆత్మహత్యలకు రేవంత్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రతీ నెల మహిళలకు రూ.2500 ఇస్తామని చెప్పి ఎందుకు ఇవ్వట్లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు ఏ మొహం పెట్టుకొని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లడుగుతారని నిలదీశారు. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా మోసం చేశారని మండిపడ్డారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని.. కాంగ్రెస్ తెచ్చిన కరువు అని ఆక్షేపించారు. రైతులకు బోనస్ ఇచ్చి రుణమాఫీ చేసి ఓట్లు అడగాలని అన్నారు. రైతు భరోసా, రుణమాఫీ, రూ.500 బోనస్ అన్ని మోసమేనని మండిపడ్డారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.




## బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలు.. యడియూరప్పపై పోక్సో కేసు నమోదు

బెంగళూరు: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ భాజపా సీనియర్ నేత, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బి.ఎస్. యడియూరప్ప (81)పై లైంగిక వేధింపుల ఆరోపణలు రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి. 17 ఏళ్ల బాలికపై ఆయన లైంగిక దాడికి పాల్పడ్డారంటూ ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఆయనపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నెల రోజుల క్రితం ఈ ఘటన జరిగినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

మోసం కేసులో సాయం చేయాలంటూ బాధితురాలు, ఆమె తల్లి ఫిబ్రవరి 2న యడియూరప్పను కలిశారు. ఆ సమయంలో తన కుమార్తెను భాజపా నేత బలవంతంగా గదిలోకి లాక్కెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారంటూ బాధితురాలి తల్లి ఫిర్యాదులో పేర్కొన్నారు. గురువారం సాయంత్రం వాళ్లు పోలీసులను ఆశ్రయించగా.. అర్ధరాత్రి తర్వాత పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ ఆరోపణలను యడియూరప్ప కార్యాలయం ఖండించింది. ఫిర్యాదుదారు గతంలోనూ పలువురిపై ఇలాంటి ఆరోపణలు చేశారని పేర్కొంది. వారు ఇప్పటివరకు 53 ఫిర్యాదులు చేశారంటూ ఆ జాబితాను విడుదల చేసింది.

**ఖండించిన యడియూరప్ప..** ఈ ఆరోపణలను యడియూరప్ప తీవ్రంగా ఖండించారు. దీనిపై తాజాగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "ఆ బాలిక, ఆమె తల్లి కొద్ది రోజుల క్రితం నన్ను కలిసేందుకు వచ్చారు. మోసం కేసులో సాయం చేయమని కోరారు. దాని గురించి బాలికతో మాట్లాడుతుంటే ఆమె ఏదీ సరిగా చెప్పలేదు. అప్పుడే ఆమె మానసిక స్థితిపై నాకు అనుమానం వచ్చింది. అయినా సరే పోలీసులను పిలిపించి వారికి అవసరమైన సాయం చేయమని చెప్పా. ఆర్థికంగా ఉపయోగపడుతుందని కొంత డబ్బు కూడా ఇచ్చా. ఇప్పుడు తిరిగి వాళ్లు నాపైనే ఫిర్యాదు చేశారు. ఇవన్నీ నిరాధార ఆరోపణలు" అని వెల్లడించారు. ఎన్నికల ముందు ఈ కేసు నమోదవడంపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. మరోవైపు, ఘటనపై రాష్ట్ర హోం మంత్రి పరమేశ్వర స్పందిస్తూ.. "ఇది చాలా సున్నితమైన అంశం. దర్యాప్తు జరిగితే గానీ నిజానిజాలు బయటకు రావు. ఇందులో ఎలాంటి రాజకీయ కుట్ర కోణం లేదు. బాధితురాలు ఫిర్యాదు మేరకే పోలీసులు కేసు నమోదు చేశారు" అని పేర్కొన్నారు. కర్ణాటకకు నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన యడియూరప్ప సీఎం పదవి వీడిన తర్వాత భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించారు. గతేడాది నవంబరులో ఆ బాధ్యతలను హైకమాండ్ ఆయన కుమారుడు విజయేంద్రకు అప్పగించింది. ప్రస్తుతం యడియూరప్ప భాజపా పార్లమెంటరీ బోర్డు సభ్యులుగా వ్యవహరిస్తున్నారు.




# పౌరసత్వ చట్టంపై అమెరికా కీలక వ్యాఖ్యలు

వాషింగ్టన్: పౌరసత్వ సవరణ చట్టం అమలు కోసం భారత్ ఇటీవల జారీ చేసిన నోటిఫికేషన్‌పై అగ్రరాజ్యం అమెరికా కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ అంశం తమని ఆందోళనకు గురిచేస్తోందని పేర్కొంది. దీన్ని ఎలా అమలు చేయనున్నారో నిశితంగా పరిశీలిస్తున్నామని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ గురువారం అన్నారు. "మార్చి 11న వచ్చిన సీఏఏ నోటిఫికేషన్‌పై మేం ఆందోళన చెందుతున్నాం. దీన్ని ఎలా అమలు చేయనున్నారో నిశితంగా గమనిస్తున్నాం. మత స్వేచ్ఛ, చట్ట ప్రకారం అన్ని వర్గాల వారిని సమానంగా చూడడం ప్రజాస్వామ్య మూల సూత్రం." అని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు మిల్లర్ సమాధానమిచ్చారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌ల నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థుల వద్ద తగిన పత్రాలు లేకపోయినా వారికి సత్వరం మన పౌరసత్వాన్ని ఇచ్చేందుకు వీలుగా కేంద్రం సీఏఏ-2019ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దీనికి 2019లోనే పార్లమెంటు, రాష్ట్రపతి ఆమోదం లభించాయి. కానీ, విపక్షాల ఆందోళనలు, దేశవ్యాప్తంగా నిరసనల కారణంతో దీన్ని వెంటనే అమల్లోకి తీసుకురాలేదు. తాజాగా సార్వత్రిక ఎన్నికలకు ముందు దీని అమలు విధివిధానాలను పేర్కొంటూ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని వల్ల ముస్లింల పౌరసత్వం పోదని కేంద్రం స్పష్టం చేసింది.

# ప్రణీత్ రావ్ రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు



హైదరాబాద్, మార్చి 15: ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావును పోలీసులు అరెస్ట్ చేయగా.. నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ప్రస్తుతం చంచల్ గూడ జైలులో ప్రణీత్ రావు ఉన్నారు. కాగా.. ప్రణీత్ రావు రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు బయటపడ్డాయి. పలువురు ఎస్ఐబీ అధికారులు, సిబ్బందిని అధికారులు విచారించారు. ప్రణీత్ రావు కేసులో 6 గురు సభ్యులతో స్పెషల్ టీంను ఏర్పాటు చేశారు. ఐఓగా జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి ఉన్నారు. టీంలో సభ్యులుగా బంజారా హిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, పంజాగుట్ట ఇన్స్పెక్టర్లతో పాటు ఇద్దరు పంజాగుట్ట ఎస్సైలు ఉన్నారు. ప్రణీత్ రావు నుంచి మూడు సెల్ ఫోన్లతో పాటు ఒక లాప్టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రణీత్ రావు మూడు రకాలుగా నేరానికి పాల్పడినట్లు గుర్తించారు. సాక్షాలు చెరిపివేత, పబ్లిక్ ప్రాపర్టీ డామేజ్, ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్ టాంపరింగ్ నేరాలకు ప్రణీత్ పాల్పడ్డారు. 17 సిస్టంల ద్వారా ప్రణీత్ రావు ట్యాపింగ్ చేసినట్లు నిర్ధారణ అయ్యింది. ఫోన్ టాపింగ్ కోసం స్పెషల్ ఇంటర్నెట్ కనెక్షన్‌ను ప్రణీత్‌కు కేటాయించినట్లు తెలుస్తోంది. రహస్యంగా ప్రముఖుల రికార్డింగ్స్‌ను మానిటర్ చేసిన ప్రణీత్.. సేవ్ చేసుకున్న రికార్డ్స్ మొత్తాన్ని అక్రమంగా పర్సనల్ పెన్ డ్రైవ్‌లో కాపీ చేసుకునే వాడు. కొంతమందితో కలిసి ప్రణీత్ అక్రమాలకు పాల్పడినట్లు సమాచారం. తన అక్రమాలు బయటపడకుండా ఉండేందుకే హార్డ్ డిస్క్‌లను తొలగించేశాడు. పాత హార్డ్ డిస్క్‌లను కట్టర్లు ఉపయోగించి డిస్మాటిల్ చేశాడు. డిసెంబర్ 4 రాత్రి పాత హార్డ్ డిస్క్‌లో ఉన్న డేటా మొత్తాన్ని ధ్వంసం చేశాడు. సంవత్సరాల తరబడి రహస్యంగా సేకరించిన డేటా మొత్తాన్ని ఎన్నికల ఫలితాల రోజు చెరిపేశాడని.. పాత హార్డ్ డిస్క్‌ల పేరుతో కొత్త హార్డ్ డిస్క్‌ను అమర్చినట్లు రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు.

# బీఆర్ఎస్‌ను వీడతారన్న వార్తలపై గుత్తా రియాక్షన్...



నల్గొండ, మార్చి 15: కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారంటూ గత కొద్దిరోజులుగా వస్తున్న వార్తలపై శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఫుల్‌స్టాప్ పెట్టారు. శుక్రవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో గుత్తా మాట్లాడుతూ.. తాను ఏ రాజకీయ పార్టీలో చేరనని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని మీటింగుల్లో మాత్రమే కలిసినట్లు తెలిపారు. అమిత్ రెడ్డి కాంగ్రెస్‌లోకి వెళ్లే విషయం తనకు తెలియదన్నారు. కాంగ్రెస్‌లోకి వెళ్తున్నాడు అనేది ప్రచారం మాత్రమే అని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ పార్టీలో క్షేత్రస్థాయిలో నిర్మాణ లోపం ఉందన్నారు. బీఆర్ఎస్ నుంచి పోటీకి అమిత్ దూరమని గుత్తా సుఖేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

# తమ్ముడి అరెస్టుపై కన్నీరు పెట్టిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

సంగారెడ్డి జిల్లా, మార్చి 15: సంతోష్ సాండ్ అండ్ గ్రానైట్స్‌ను నిబంధనలకు విరుద్ధంగా నడిపారనే కారణంతో తమ్ముడు మధుసూదన్‌రెడ్డి అరెస్ట్‌పై పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి స్పందించారు. శుక్రవారం మాజీ మంత్రి హరీష్‌రావుతో కలిసి మహిపాల్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్ముడి అరెస్ట్ పట్ల తీవ్ర భావోద్వేగానికి గురవుతూ ఎమ్మెల్యే కన్నీరుపెట్టుకున్నారు. రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో లక్డారం క్వారీ అనుమతులు తీసుకున్నామని.. క్వారీని గతంలోనే లీజుకు ఇవ్వడం జరిగిందని తెలిపారు. గత నాలుగేళ్లుగా తమ సోదరుడు మధుసూదన్ రెడ్డి చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మూడు నెలలు గడవక ముందే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఇబ్బందులకు గురిచేయటం జరుగుతుందని మండిపడ్డారు. తాము తప్పు చేస్తే పెనాల్టీ వేయాలని.. నోటీసు ఇవ్వాలని.. అంతేకాని దొంగలు లెక్క తెల్లవారుజామున 3 గంటలకు మధుసూదన్ రెడ్డిని అరెస్టు చేయటం చట్ట విరుద్ధమన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై జరుగుతున్న వేధింపులకు ఇది ప్రత్యక్ష నిదర్శనమని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా మూడు సార్లు ప్రజా ఆశీస్సులతో గెలిచానని.. తాను తప్పు చేస్తే ప్రజలు బండకేసి కొట్టేటోళ్లని చెప్పుకొచ్చారు. అన్ని పర్మిషన్లతో క్రషర్ నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. గతంలో ప్రభుత్వం హయాంలో లేని సమస్య ఇప్పుడు ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ బెదిరింపులకు భయపడేది లేదని మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com